తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## టిటిడికి రూ.5లక్షలు ఎరువులు విరాళం

తిరుమల,డిసెంబర్ 28(ప్రభాతవార్తప్రతినిధి:



టిటిడి ఉద్యానవనశాఖకు అవసరమైన సేంద్రీయ ఎరువులను 5లక్షలు రూపాయలు విలువైనవి దాతలు అందించారు. శనివారం రాత్రి దాతలు తిరుపతి పంచాయితీ రాజ్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోహర్‌బాబు, వ్యవసాయాదికారిణి ప్రపూర్ణ, జనరల్ మేనేజర్ శ్రీనివాస్ కలసి డిఎఫ్‌ఓ శ్రీనివాస్‌కు 5లక్షలు విలువైన 20టన్నుల సేంద్రీయ ఎరువులు విరాళంగా అందజేశారు.

## జిల్లా నూతన పోలీసు కార్యాలయం పనులు డిజిపి తనిఖీ

తిరుపతికార్పొరేషన్,డిసెంబర్ 28ప్రభాతవార్త:



తిరుపతిజిల్లాకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీసు జిల్లా పరిపాలన కార్యాలయం భవనాలు, ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీని రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావు శనివారం రాత్రి తనిఖీ చేశారు. ఈపనులు త్వరగా పూర్తిచేయలన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, ఏఆర్ డిఎస్పీ రవీంద్రరెడ్డి, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

# వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు



**-ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో టైమ్‌స్లాట్ టోకెన్లు**
**జనవరి 10,11,12తేదీలకు 9న 1.20లక్షల టోకెన్లు ఒకేరోజు జారీ**
**టిటిడి ఈఓ శ్యామలరావు**

తిరుమల,డిసెంబర్ 28(ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పరమపవిత్రమైన మోక్షమార్గం వైకుంఠద్వార దర్శనాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు టిటిడి ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని 9 చోట్ల ఆఫ్‌లైన్‌లో ఈ టోకెన్లు జారీకి సంబంధించి జనవరి 10,11,12తేదీలకు మూడురోజులకు 9వతేదీనే ఒకేసారి 1.20లక్షల టోకెన్లు 8కౌంటర్లలో, తిరుమలలోని 4కౌంటర్లలో జారీ అవుతాయని చెప్పారు. మిగిలిన ఏడురోజులకు సంబంధించి ఏ రోజుకా ముందురోజు టోకెన్లను భూదేవికాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణునివాసంలలో టోకెన్లు జారీచేస్తారన్నారు. టోకెన్లు అందుకునేందుకు వచ్చే సామాన్యభక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తిరుపతిలోని శ్రీనివాసం,విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్, రామచంద్రపుష్కరిణి, ఇందిరామైదానం, జీవకోనలోని జడ్పీ ఉన్నతపాఠశాల, బైరాగిపట్టెలోని రామానాయుడు ఉన్నతపాఠశాల, ఎంఆర్‌పల్లిలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉచితంగా ఈ వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు జారీ అవుతాయన్నారు. తిరుమలవాసులకు స్థానికంగానే బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తారు.ఈ టోకెన్లను అందుకోవడానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున టిటిడి, పోలీసు, విజిలెన్స్ సంయుక్తంగా సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ సిద్ధంచేశామన్నారు. దర్శన టోకెన్లు, టిక్కెట్ ఉన్న భక్తులకే ఆలయంలోనికి అనుమతించడం జరుగుతుందని ఈఓ తెలిపారు. శనివారం ఉదయం అన్నమయ్యభవనంలో డయల్ యువర్ ఈఓ కార్యక్రమానికి ముందు టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ గౌతమి, సివిఎస్ఓ శ్రీధర్, సిఎస్ఓ ఎన్టీవిరామ్‌కుమార్, డిప్యూటీ ఈఓలు లోకనాథం, హరీంద్రనాథ్, భాస్కర్,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమ పాల్గొన్నారు. గోవిందమాల ధరించిన భక్తులు కూడా తిరుపతిలో టోకెన్లు పొంది స్వామివారిని దర్శించుకోవాలని ఈఓ స్పష్టం చేశారు. భక్తులు క్యూలైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా భక్తులకు టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తామన్నారు. దర్శన టిక్కెట్లు, టోకెన్లు ఉన్నవారినే ఆలయంలోనికి అనుమతినిస్తామని, లేకుంటే ఆలయంలోనికి రాలేరని తెలిపారు.

### ఆ పదిరోజులు నడచివచ్చే భక్తులకు
## శ్రీవారిమెట్టుమార్గంలో టోకెన్లు ఇవ్వాలి
**తిరుమలలో ట్యాక్సీడ్రైవర్ల దోపిడీచేస్తున్నారు**
**డయల్ యువర్ ఈఓకు భక్తులు**

తిరుమల,డిసెంబర్ 28(ప్రభాతవార్తప్రతినిధి:

ధనుర్మాసంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శ నాలకు సంబంధించి పదిరోజులు వసతి పొందడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేయాలని, కాలినడక భక్తులకు శ్రీవారిమెట్టుమార్గంలో టోకెన్లు ఇవ్వాలని తిరుపతికి చెందిన మునిలక్ష్మి, చిత్తూరు నుండి వెంకటరమణ కోరారు. దీనిపై ఈఓ శ్యామలరావు మాట్లాడుతూ ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో 1.20లక్షల టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తున్నామన్నారు. తిరుమలలో ట్యాక్సీడ్రైవర్లు భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారని, ఇంకా భక్తుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని మచిలీపట్నంనుండి శేఖర్ ఫిర్యాదు చేశాడు. దీనిపై ఈఓ స్పందిస్తూ తిరుమలలో భక్తులకోసం 12 ఉచిత ధర్మరథాలను నడుపుతోన్నామని, త్వరలో మరి కొన్ని వస్తాయన్నారు. రేణిగుంట నుండి విష్ణు మాట్లాడుతూ ఆన్‌లైన్ లక్కీడిప్‌లో కుటుంబంలో ముగ్గురికి అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు ఈఓ సమాధానంగా ఇప్పటికే ఇద్దరికి అనుమతి నిస్తున్నామని, అదీ వీలుకాదన్నారు. శనివారం ఉదయం అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఈఓ" కార్యక్రమానికి దేశం నలుమూలల నుండి భక్తులు ఫోన్‌ద్వారా తమ సూచనలు,సలహాలు, ఫిర్యాదులు, అభిప్రాయాలనుఈఓ దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నిటిపై ఈఓ శ్యామలరావు టిటిడిలోని అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ గౌతమి, సివిఎస్ఓశ్రీధర్, సిఎస్ఓ ఎన్టీవిరామ్‌కుమార్, డిప్యూటీ ఈఓలు లోకనాథం, హరీంద్రనాథ్, భాస్కర్,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమతో కలసి కార్యక్రమం నిర్వహించారు.

### ఒక రోజు ముందే...
# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు

తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 28 ప్రభాతవార్త ః



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు జనవరి నెలలో పంపిణీ చేయాల్సిన చెల్లింపులు జనవరి 1వ తేది నూతన ఆంగ్ల సంవత్సరం తొలిరోజు కావడం వలన రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబరు 31వ తేదిన మంగళవారం ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. డిసెంబరు 31వ తేదిన ఎన్టీఆర్ భరోసా ఫించన్లు ఏదైనా కారణం చేత తీసుకోని లబ్ధిదారులకు 2 జనవరి, 2005 తేదిన వారి ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా జిలల్లాలోని 2,63,995 మంది ఫించన్ దారులకు దాదాపు రూ. 112.59 కోట్లు పంపిణీ చేయవలసి ఉండగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే 31 డిసెంబరు 2024వ తేదిన పెన్షన్లు పంపిణీ చేయాలని, అదే రోజు వంద శాతం పించన్లు పంపిణీ చేయాలని, దానికి అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఒక రోజు ముందే పించన్లు ఇస్తున్నందుకు కూటమి ప్రభుత్వం పట్ల జిల్లాలోని ఫెన్షన్ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు. అలాగే గత రెండు నెలలో ఏదేని కారణంతో పింఛన్ తీసుకోని వారికి ఈ నెల 3 నెలల పింఛన్ మొత్తం పంపిణీ చేయబడుతుందన్నారు. అలాగే నవంబరు 2024 నెలలో జీవిత భాగస్వామి మరణించిన వారికి ఈ నెలలో కొత్తగా పింఛన్ మంజూరు చేయడం జరిగిందన్నారు.దీనిపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమీషనర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

### తిరుపతి ప్రాంత ఆర్థికాభివృద్ధికి
# నూతన ప్రాజెక్టు దోహదం
**-ఎస్‌బిఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి**



తిరుపతి,డిసెంబర్ 28ప్రభాతవార్త:

దేశంలోనే అత్యున్నత బ్యాంకింగ్ వ్యవస్థ భారతీయ స్టేట్ బ్యాంకు నూతన ప్రాజెక్టు చేపట్టడం వల్ల తిరుపతి జిల్లా ప్రాంత ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఎస్‌బిఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి తెలిపారు. ప్రాజెక్టు ప్రాముఖ్యత, ఎస్‌బిఐ తన పరిధిని విస్తరించడం, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తారన్నారు. ఈ సేవలే వినియోగదారుల నుండి మన్ననలు, ప్రాజెక్టు విస్తరణకు ఉపయోగకరంగా ఉందన్నారు. ఎస్‌బిఐ నూతన ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత శనివారం ఉదయం తొలిసారిగా తిరుపతికి వచ్చిన చల్లా శ్రీనివాసులుశెట్టి తిరుపతి కరకంబాడిలో నూతన పరిపాలన భవనం నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. ఈ ప్రాజెక్టు విజయవంతంగా సకాలంలో పూర్తిచేయడానికి ,ఉద్యోగుల శ్రేయస్సుకోసం ఈ భవనం నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌బిఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్‌పటేల్,జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.లేఖా మీనన్, తిరుపతి ప్రాంతీయ కార్యాలయం,జోనల్ కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### దొంగతనానికి గురైన బంగారు నగలు
# 24 గంటల్లో రికవరీ

**- ఆటోలో ప్రయాణీకులుగా వెళ్లూ 58 గ్రాముల బంగారం దొంగతనం**
**- టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు**
**- ముగ్గురు మహిళా నిందితులను పట్టుకొని బంగారంను రికవరీ**



నిందితులను అరెస్టు చేసిన టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య బృందం

చిత్తూరు, డిసెంబర్ 28 ప్రభాతవార్త: జిల్లా కేంద్రం చిత్తూరులో మాయలేడీలు అధికం అయ్యారు. ప్రయాణీకులుగా వెళ్తున్న ఆటోలో ఎక్కి ఆటోలో ప్రయాణిస్తున్న మహి ళల విలువైన వస్తువులను దొంగలిం చుకుని చక్కగా ఊడాయిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు తరచు జరుగుతున్నప్పటికీ ప్రజలు ఏ మాత్రం అప్రమత్తంగా వుండటం లేదు. చిత్తూరు రామ్‌నగర్‌కాలనీలో వున్న తన కుమారుడి ఇంటి నుండి తన స్వగ్రామం యాదమరి మండలం ఎర్రచేను గ్రామంకు వెళ్ళాలని ఓ వృద్ధమహిళ జ్ఞానమ్మ(65) గురువారం మధ్యాహ్నం 12 గంటలకు దర్గా సర్కిల్‌కు వచ్చి యాదమరి వైపుకు వెళ్ళే ఆటో ఎక్కింది. జ్ఞానమ్మ వద్ద రూ.20 వేల నగదుతో పాటు 58 గ్రాముల బంగారు నగలు వున్నాయి. జ్ఞానమ్మ 20 వేల నగదు, 58 గ్రాముల బంగారంను ఒక సంచిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నది. ఈ క్రమంలో కాజూరు సర్కిల్ వద్ద మరో ముగ్గురు మహిళలు ఆటో ఎక్కారు. వీరు కమ్మరాయనిమిట్టకు సమీపంలో ఆటో దిగి వెళ్ళిపో యారు. ఆటోలో యాదమరికి వెళ్ళిన జ్ఞానమ్మకు తన వద్ద సంచిలో వున్న బంగారు నగలు, డబ్బులు లేకపోవడంతో ఆటోలో దొంగతనం పోయిందని గ్రహించి చిత్తూరు టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించుకుని, చిత్తూరు-ఇరువారం రహదారిలో వున్న సిసి కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలించి, ఇలాంటి దొంగతనాలు చేసిన పాత నేరస్తులను విచారించి బంగారు నగలు దొంగతనం చేసిన వారిని పట్టుకున్నారు. ఓబనపల్లి కాలనీ ప్రభుత్వ పాఠశాలలో అనుమానస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మహిళా నిందితులు పట్టుకుని విచారిస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మంగసముద్రం హౌసింగ్ కాలనీకి చెందిన మేకల దుర్గ(49), తోట లలిత(30), గంట లలిత(32)లు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి ఇలా ఆటోల్లో ప్రయాణీస్తున్న ప్రయాణీకులు ఎమారుపాటులో వున్న సమయంలో చాకచక్యంగా బ్లేడ్లతో బ్యాగులు కోసి విలువైన వస్తువులను దొంగలిస్తుంటారన్నారు. ఈ మేరకు వీరు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య తెలిపారు.

### ద్విచక్ర వాహనాల
# విచిత్ర ధ్వనులకు బ్రేక్
**- జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు**





తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 28, ప్రభాతవార్త

ద్విచక్ర వాహనాల విచిత్ర ధ్వనులకు జిల్లా ఎస్పి బ్రేక్ చేసారు. శనివారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో 385 బుల్లెట్ వాహనాలకు సంబంధించిన సైలెన్సర్‌లను రోడ్ రోలర్ సహాయంతో నుజ్జు నుజ్జు చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి సుబ్బరాయుడు మాట్లాడుతూ వాహనాలకు అధిక శబ్ధం చేసే హారన్‌ల పై దృష్టి సారించి జరిమానా విధిస్తామన్నారు. నగరంలో గత కొద్ది రోజులుగా బుల్లెట్ వాహ నాలకు 65 డెసిబెల్ కంటే ఎక్కువగా శబ్దం కలిగించే వాహనాలను గుర్తించాము. యువత, కాలేజీ విద్యార్థులు ఫ్యాషన్ లు కొరకు బైక్ లకు షోరూమ్ నుండి రిజిస్టరుగా వచ్చిన సైలెన్సర్ లను మార్చి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తునారు. శబ్ద కాలుష్యం అధికంగా ఉండటం వలన రోడ్డుపై ప్రయాణించే ప్రజలు భయ బ్రాంతులకు లోనవుతున్నారు. అదేవిధంగా సుప్రీం కోర్ట్ మరియు హైకోర్టు గైడ్లెన్స్ ప్రకారం అందరూ కూడా హెల్మెట్ ధరించే విధంగా ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు చేయడం కూడా జరుగుతుంది ప్రజలందరూ కూడా మీ భద్రత కోసమే చెబుతున్నామన్నారు. అనంతరం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నందు ఏర్పాటు చేసిన హెల్మెట్ అవగాహన ర్యాలీలో పాల్గొని జెండా ఊపి ర్యాలిని ప్రారంభించి, ఎస్పీ కూడా హెల్మెట్ ధరించి వాహనం నడిపారు. ర్యాలీలో పోలీస్ అధికారులు సిబ్బంది, మహిళా విశ్వవిద్యాలయం సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు వెంకటేశ్వరరావు అడ్మిన్, రవిమనోహరాచారి ఎల్అండ్ఓ, ట్రాఫిక్ డి.యస్.పి రామకృష్ణ ఆచారి, సి.ఐ లు సుబ్బారెడ్డి, సంజీవ కుమార్, యస్.ఐ మరియు సిబ్బంది వారు పాల్గొన్నారు.

## జగన్ అవినీతి వల్లే ప్రజలపై రూ. 1,29,000 కోట్ల భారం 2లో





## ప్రజలపై 1.89లక్షల కోట్ల భారం మోపిన పాపం జగన్‌దే 4లో

## వైసీపీ నాయకులు ధర్నాలు చేయడం హాస్యస్పదం 4లో



### ఫ్లెమింగో ఫెస్టివల్‌లో
# మూడురోజుల పాటు బోటు షికారు
**- పులికాట్ తీరంలో పర్యటించిన మత్స్యశాఖ అధికారులు**



తడ, డిసెంబర్ 28 ప్రభాతవార్త

జనవరిలో జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ 2025కు మూడురోజుల పాటు పులికాట్ సరస్సులో బోటు షికారు నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఇందుకోసం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మత్స్యశాఖ అధికారులు శనివారం భీములవారిపాలెం పడవల రేవు వద్ద పర్యటించారు. స్థానిక అధికారులు, పులికాట్ జాలర్లతో వారు మాట్లాడారు. గతంలో జరిగిన బోటు షికారులో సందర్శకులకు ఏ విధంగా ఆహ్లాదం కలిగించారన్నది ప్రధానంగా చర్చించారు. అనంతరం అక్కడే ఉన్న టూరిజం రిసార్ట్‌లో సమావేశమయ్యారు. ఫిషరీస్ ఈడీ నాగరాజు, ఎఫ్‌డిఓ మహిజ, తడ ఎంపిడిఓ విజయకుమార్, తహశీల్దార్ శరత్‌బాబు, మాజీ జడ్పిటిసి బొమ్మన్ శ్రీధర్, మత్స్యకార సంఘ నాయకులు బొమ్మన్ పళణి, భీములవారిపాలెం ఎంపిడిసి రమేష్, సర్పంచ్ కోడి ప్రకాష్, వాటంబేడు మాజీ సర్పంచ్ ఏకాంబరం, జయపాల్ తదితరులు పాల్గొన్నారు. 2019లో బోటు షికారుకు వినియోగించిన పడవలకు సంబంధించిన రూ.5 లక్షల బకాయిలు ఇప్పటికీ చెల్లించలేదని, ప్రభుత్వం ద్వారా వాటిని ఇప్పించాలని పలువురు జాలర్లు అధికారులను కోరారు.

# టిడ్కో గృహాలకు మోక్షమెప్పుడు పరమేశ్వరా?!

**మార్చి తరువాతే అంటున్న అధికారులు**
**పూర్తి చేయటానికి రూ.59కోట్లు కావాలి!!**



శ్రీకాళహస్తిలో టిడ్కోగృహాలు

(శ్రీకాళహస్తి - ప్రభాతవార్త)

శ్రీకాళహస్తిలోని రాజీవ్ నగర్ సమీపంలో లబ్దిదారుల భాగస్వామ్యంతో ఇళ్ల నిర్మాణాన్ని 2015-16లో ప్రభుత్వం చేపట్టింది.ఈ ఇళ్లను ఆపార్టుమెంట్‌లుగా నిర్మించి అందులో అవకాశం కల్పిస్తారు. ఉచితంగా అందిస్తే లబ్దిదారులు అనుభవించటం లేదని అమ్ముకుంటున్నారని వారి భాగస్వామ్యం ఉండాలని బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించారు.లబ్దిదారులు రూ.50వేలు, రూ.,లక్ష చెల్లించారు. డబుల్ బెడ్ రూం,సింగిల్ బెడ్ రూంలుగా నిర్మాణం చేపట్టారు.ఈ నేపథ్యంలో సుమారు 6వేల మందిని ఎంపిక చేసారు. వారిలో సుమారు 4500 మంది ఇళ్ళకు తాము ముందుగా చెల్లించాల్సిన పాతిక వేలు, 50వేలు,రూ.లక్ష చెల్లించారు. ఇళ్ల నిర్మాణం అదిగో ఇదిగో అంటూ ఊరించి ఊరించి చివరకు 2018 చివరిలో ఓ పెద్ద సమావేశం నిర్వహించి లబ్దిదారులకు ఆపార్టుమెంట్లు కేటాయించారు. వారికి టోకెన్ నెంబర్లు ఇచ్చారు. అయితే నిర్మాణంలో చివరి దశలో ఎన్నికలు జరగటం ప్రభుత్వం ఓడిపోవటం కొత్త ప్రభుత్వం రివర్స్ టెండర్ల పేరుతో నిర్మాణాలను మూలపడేసింది.ఆరేళ్ళు గడుస్తున్నా అతీగతి లేదు. టిడ్కో ఇళ్ళకు తమ పార్టీ రంగులు వేసుకున్నారు. కానీ లబ్దిదారులకు ఆపార్టుమెంట్లు అప్పగించలేదు.

**ఇళ్లే ఇవ్వలేదు: బ్యాంకర్ల వేధింపులు:**

శ్రీకాళహస్తిలో నిర్మించిన టిడ్కో ఇళ్ల పరిస్థితి గమనిస్తే ఆరేళ్ళ క్రితం సొంత గూడు ఆశతో లబ్దిదారులు అప్పులు చేసి కొందరు తమ వద్ద కాస్తోకూస్తో ఉన్న నగలను తాకట్టు పెట్టి మరి కొందరు టిడ్కో ఇళ్ళకు రూ.50వేలు, రూ.లక్ష డిపాజిట్ చేసారు.దానికి తోడు బ్యాంకుల వద్ద రుణపత్రాలపై సంతకాలు చేయించారు. కానీ ఇల్లు ఇవ్వలేదు.ఆరేళ్లు గడిచింది. ఇస్తారో లేదో? తెలియదు? ఎప్పుడు ఇస్తారో అంతుపట్టడం లేదు. అయితే బ్యాంకర్లు మాత్రం తమ అకౌంట్లలో సొమ్ములను రికవరీ పేర సర్దుబాటు చేసుకుంటున్నారు. బ్యాంకులో ఖాతాదారులు తమ అకౌంట్లో డబ్బులు ఎందుకు సర్దుబాటు చేసుకుంటున్నారని ప్రశ్నిస్తే ఇంటి ఇఎంఐ రికవరీ అంటూ వర్రి చేస్తున్నారు. దాంతో లబ్దిదారులు షాక్‌కు గురౌతున్నారు. ఒక్కొక్క లబ్దిదారుని పేరిట బ్యాంకులు రూ.1,60,000లు రుణం ఇచ్చినట్లు రికార్డులున్నాయి.ఈ మొత్తాన్ని ప్రస్తుతం రికవరి చేస్తూన్నారు. మూడేళ్ల క్రితం ప్రభుత్వం బ్యాంకుల నుంచి అగ్రిమెంట్ చేసిన లబ్దిదారుల పేరిట రుణం తీసుకున్నట్లు సమాచారం.దాంతో బ్యాంకులు తమ మనుగడ కోసం లబ్దిదారుల ఖాతాల నుంచి సర్దుబాటు చేసుకుంటున్నారు. ఖాతాలు లేని వారికి బ్యాంకులు నోటీసులు జారి చేస్తున్నారు.ఇదేమి చోద్యమని లబ్దిదా రులు ప్రశ్నిస్తే తమకు అందంతా తెలియదు మీరు పేర రుణం ఉంది.మీరుచేసినఅగ్రిమెంట్‌ఉందంటూబెదిరిస్తున్నట్లు చెబుతున్నారు.

**మార్చి తరువాతనే పనులు:**

శ్రీకాళహస్తిలో టిడ్కో గృహాలకు సంబంధించి ప్రభాతవార్త సంబంధిత అధికారి శ్రావణిని వివరణ కోరగా ఆమె ఇలా తెలిపారు. శ్రీకాళహస్తిలో 4064 ఇళ్ళు నిర్మించారు.అయితే మౌళిక సదుపాయాలు,ప్యాచ్ పనులు చేయాల్సి ఉందని వివరించారు.సంబంధిత శాఖ మంత్రిని శాసనసభ్యులు కలసినపుడు మార్చి తరువాతనే పనులు ప్రారంభం అవుతాయని వివరించారు. జూన్ నాటికి లబ్దిదారులకు అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని వివరించారు. ఇక్కడి టిడ్కో గృహాలు పూర్తి స్థాయిలో లబ్దిదారులకు అందించాలంటే రూ.50కోట్లు నిధులు అవసరమని ఆమె వివరించారు.

## రొంపిచెర్ల పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



**రొంపిచెర్ల, డిసెంబర్ 28, ప్రభాతవార్త:** రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో చిత్తూరు డీఎస్పీ కె.సాయినాథ్ వార్షిక తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన జూదం, దొంగతనాలను అరికట్టాలని సూచించారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అలాగే వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారెడ్డి, ఏఎస్ఐ లు మధు, తులసీరాం, హెడ్ కానిస్టేబుల్ లు కృష్ణయ్య, కానిస్టేబుల్ వేణు, కార్తీక్, సురేష్ పురుషోత్తం, రెడ్డెప్ప రెడ్డి, అనీఫ్, సుబ్బయ్య, హోమ్ గార్డు రవి కుమార్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## హృదయాంతరంగంలోని చైతన్యమే అభివృద్ధికి ప్రతీక



చౌడేపల్లి, డిసెంబర్ 28 ప్రభాతవార్త హృదయాంతరంగంలోని నిరంతరం జ్వలించే చైతన్యమే జాతి పురోభివృద్ధికి ప్రతీకని ఎంఇఒలు కేశవరెడ్డి, తిరుమలలన్నారు. స్థానిక ఉన్నతపాఠశాల ఆరవణంలో మండలంలోని విద్యార్థులచే తయారు చేయబడ్డ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగున్న విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు ప్రదనర్శనలు ఉపయుక్తంగా వుంటాయన్నారు.

**విజేతలు వీరే :** మండల స్థాయిలో జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదనర్శనకు న్యాయ నిర్ణేతలుగా పిజిటి సుదర్శన్ కుమార్, విజయలక్ష్మిలు వ్యవహరించారు. కాగతి ఉన్నతపాఠశాల ధనుష్‌రెడ్డి తయారు చేసిన ప్రయోగం మొదటి స్థానంలో నిలచాడు. చారాల పాఠశాల విద్యార్థులు పూజశ్రీ, శరణ్యలు ద్వితీయస్థానం, కోటూరు ఎంపిపి యుపిఎస్ పాఠశాల విద్యార్థి ఫాసుల్లా తృతీయ స్థానాన్ని దక్కించుకొన్నాడు. విజేతలు ఈనెల 30న చిత్తూరులో జరిగే జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. సిర్పీలు రఘు, లావణ్య, ఉపాధ్యాయులు ఆనంద్, ఉమాశంకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, మురళీ, ఈశ్వర్, పరిమళ, పూర్ణిమ, జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## సమీకృత వ్యవసాయ రంగంతో ఆదాయం రెట్టింపు : వెంకట్రమణ

కాగతి(చౌడేపల్లి), డిసెంబర్ 28 ప్రభాతవార్త



సమీకృత వ్యవసాయ రంగంతో కుటుంబ ఆదాయం రెట్టింపు అవుతుందని డిఆర్‌డిఏ ఎపిఎం వెంకట్రమణ అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం కాగతిలో ఐఎఫ్‌సి క్లస్టర్ సమీకృత వ్యవసాయ రంగంపై మహిళా కిసాన్ రైతులకు అవగాహన సమావేశం జరిగింది. ప్రతి కుటుంబం, మహిళలకు అనేక రకాల జీవనోపాధులు కల్పించి ఆయా కుటుంబాల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే సమావేశం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందుకుగాను మహిళలు ఎఫ్‌పిజిలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఎపిఎం సుబ్రమణ్యం, సిసిలు, ఐకెపి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా శని త్రయోదశి



పుంగనూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

మార్గశిర శుక్లపక్షత్రయోదశి సందర్భంగా పుంగనూరులోని శనేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. దండుపాలెం గ్రామ మార్గంలోని ఆలయంలో శని భగవానుని పలు రకాల సుగంధ ద్రవ్యాలతో గోక్షీరంతో అభిషేకించి స్వామికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.అనంతరంశనేశ్వరస్వామికివారిని విశేషం గాఅలంకరించిభక్తులకుదర్శనభాగ్యంకల్పించారు.భక్తులుఅధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## మణప్పరం వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

పుంగనూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త



మణప్పురం ఫైనాన్స్ వేధింపులు తాళలేక వ్యక్తి మృతి చెందాడు. మానప్పురం ఫైనాన్స్ కార్యాలయం వద్ద వ్యక్తి కుటుంబ సభ్యులు ఆందోళన. చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణ పరిధిలోని బీడీ కాలనీకు చెందిన దస్తగిరి కుమారుడు అజ్మతుల్లా 38 సంవత్సరాలు జెసిబికు మానప్పురం ఫైనాన్స్‌లో లోన్ చేశారు. గత రెండు నెలలుగా జెసిబి పనులు జరగకపోవడంతో ఫైనాన్స్ వారికి నెలవారి చెల్లించవలసిన డ్యూలు చెల్లించలేదు. కొన్ని రోజులు క్రితం మానప్పురం ఫైనాన్స్ వారు జెసిబిని స్వాధీనం చేసుకున్నారు. జెసిబి స్వాధీనం చేసుకోవడంతో త్రివ మనస్థాపానికి చెందిన అజ్మతుల్లా ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. అజ్మతుల్లా మృతికి మానప్పురం ఫైనాన్స్ వారి వేధింపుల కారణమని శనివారం మధ్యాహ్నం ఒక గంటకు మానప్పురం ఫైనాన్స్ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## విశ్రాంత ఉద్యోగులకు ఉచిత నేత్ర చికిత్సలు



పుంగనూరు రూరల్, డిసెంబర్ 28, ప్రభాతవార్త

పట్టణంలోని తాటిమాకులపాళ్యం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. కంటి జబ్బు సమస్యతో శిబిరానికి వచ్చిన వారిని డాక్టర్ మురళీకృష్ణ పరీక్షించారు. అవసరమైన 42 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

## పట్టణాభివృద్ధికి సమ సహకారం

పుంగనూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త



2024 వ సంవత్సరంలో పుంగనూరు పట్టణాభివృద్ధి కోసం అధికారులు కౌన్సిల్ సిబ్బంది సమిష్టి సహకారంతో కొట్లాది రూపాయలు అభివృద్ధి సాధించామని ఈ ఘనత అందరికీ చెందుతుందని మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాష అన్నారు. శనివారం ఉదయం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో ఎన్నో మార్పులు వచ్చాయని 2024 సంవత్సరంలో అభివృద్ధి లక్ష్యంగా పుంగనూరు మున్సిపాలిటీ కోట్లాది రూపాయలు పనులు నిర్వహించిందని తెలియజేశారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవ నిర్ణయంతో ఆమోదించింది. కమిషనర్ మధుసూదన రెడ్డి వైస్ చైర్మన్లు కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబును కలసిన శాంతిపురం దేశం నేతలు



శాంతిపురం, డిసెంబర్ 28 ప్రభాతవార్త శాంతిపుర ం కు చెందిన పలువురు తెదేపా నేతలు సిఎం చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి వారు సిఎంకు వివరించగా సిఎంచంద్రబాబుసానుకూలంగా స్పందించారని చెప్పారు. ముఖ్యమంత్రిని కలసిన వారిలో నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, ఎల్.జయరాంరెడ్డి, మణి, చంద్ర, మంజునాథ్‌రెడ్డి, నామాలప్ప, శివశంకర్, రుద్రప్ప, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

**చిత్తూరు, డిసెంబర్ 28 ప్రభాతవార్త:**

చిత్తూరు నగర పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి శనివారం ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున జరిమానా విధించింది. వివరాలిలా వున్నాయి. చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు ఆద్వర్యంలో జరిగిన ఈ వాహనాల తనిఖీలో 16 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు శనివారం కోర్టు ఎదుట హాజరు పరచగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున 1.60 లక్షల రూపాయల జరిమానా విధించారు.

## రోగులకు పక్కాగా వైద్యం

– పిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ చేసిన డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి



**గుడిపాల, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** వైద్యం కోసం పిహెచ్‌సికి వచ్చిన ప్రతి రోగికి వైద్యాధికారులు, సిబ్బంది పక్కాగా వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి ఆదేశించారు. గుడిపాల పిహెచ్‌సిని శనివారం డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి అకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యం కోసం పిహెచ్‌సికి వచ్చిన రోగులను డిఎంహెచ్‌ఓ అక్కడి వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి సిబ్బందితో డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారని, ప్రభుత్వ ఆసుపత్రులు, పిహెచ్‌సిల్లోనే గర్భిణీ స్త్రీలకు కాన్పులు చేయాలన్నారు. ఈ విషయంపై గర్భిణీ స్త్రీలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకునేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ పిహెచ్‌సిలోని రికార్డులను తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో పొందుపరచిన వివరాలను సరిచూశారు. ఈ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రమహేష్, డాక్టర్ సంధ్య, డిఎంఓ అనిల్‌కుమార్, ఆర్‌బిఎస్‌కె డాక్టర్ శిరీష, ఎపిడాలజిస్ట్ వాణి, మునిశేఖర్, రమేష్, మోహన్‌శెట్టి, పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నా రు.

## మంత్రి సవితమ్మను కలిసిన షణ్ముగం



**చిత్తూరు, డిసెంబర్ ప్రభాతవార్త 28:** జిల్లా పర్యటన నిమిత్తం శనివారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు నివాసానికి వచ్చిన రాష్ట్ర బిసీ సంక్షేమశాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మను మాజీ టౌన్‌బ్యాంకు ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షణ్ముగం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో బిసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని కోరారు.

## జాతీయ జూనియర్ కబడ్డీ పోటీలకు అనిత



**చిత్తూరు, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ జూనియర్ కబడ్డీ పోటీలకు సదుం కబడ్డీ క్లబ్ క్రీడాకారిణి ఎస్.అనిత ఎంపికైంది. సదుం కబ్బడ్డీ క్లబ్ కోచ్ శ్రీను వద్ద గత ఐదు సంవత్సరాల పాటు కోచింగ్ తీసుకున్న అనిత ఈ నెల 22 నుండి 25వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా రావులపాళెంలో జరిగిన రాష్ట్ర జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో తన సత్తా చాటింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో అనిత జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైంది. జాతీయ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైన అనితను కోచ్ శ్రీను, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు మమత, ఆర్గనైజింగ్ కార్యదర్శి రవీంద్రారెడ్డిలు అభినందించారు.

## మాజీ సిఎం జగన్ నిర్ణయాలతోనే విద్యుత్ వ్యవస్థ నాశనం

– ఎమ్మెల్యేలు పులివర్తినాని, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు ధ్వజం



**చిత్తూరు, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** రాష్ట్రంను ఐదేళ్ళ పాటు అస్థవ్యస్థంగా పరిపాలించి అన్ని వ్యవస్థను మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాశనం చేశారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేలు పులివర్తినాని, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు విలేకరులతో మాట్లాడుతూ మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి గాడిలో పెట్టాల్సిన విద్యుత్ వ్యవస్థను అనాలోచిత నిర్ణయాలు అమలు చేసి గాడి తప్పించాడని దుమ్మెత్తిపోశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్న సమయంలో సోలార్ ప్లాంట్లపై దాడి, చట్ట విరుద్దంగా పిపిఎల్‌లను రద్దు చేయడంతో రాష్ట్రానికి రావాల్సిన 7 వేల మెగా యూనిట్ల విద్యుత్ రాకుండా పోయిందని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సిఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామికి విశేష పూజలు

కల్లూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త:



పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో మార్గశిర మాసం నాల్గవ శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చనలు, పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. ఉభయ దారులు చల్లవారిపల్లెకు చెందిన మునిరాజా కుటుంబ సభ్యులు వ్యవహరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## రెవెన్యూ సదస్సులో గంటలోపే పాస్ బుక్ మంజూరు

యర్రావారిపాలెం, డిసెంబర్ 28, ప్రభాతవార్త:



రెవిన్యూ సదస్సులో గంటలోపే పాస్ బుక్ మంజూరు చేయడం జరిగిందని తహసీల్దార్ పరమేశ్వర స్వామి తెలిపారు. శనివారం మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో దీర్ఘకాలంగా పాస్ పుస్తకానికి ప్రయత్నిస్తున్న రైతుకు అక్కడిక్కడే పాసు పుస్తకంను తహసీల్దార్ మంజూరు చేశారు. యర్రావారి పాలెం రెవెన్యూ గ్రామంకు చెందిన పుల్లూరి నాగరాజు నాయుడు గ్రామంలో తనుకున్న భూమిని పాస్ బుక్ కోసం వినతి పత్రం అందించారు. ఈ క్రమంలో రెవిన్యూ సదస్సులో రైతు నాగరాజు నాయుడు తన సమస్యను ఆధారాలతో సహా విన్నపించారు. రికార్డులు పరిశీలించి తహసీల్దార్ పరమేశ్వర స్వామి వెంటనే పాస్ బుక్ మంజూరు చేస్తూ, వెంటనే ఆన్లైన్లో భూమి వివరాలను నమోదు చేశారు. దీంతో రైతు నాగరాజు నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గణనాధుని దర్శించుకున్న ఒడిస్సా హైకోర్టు న్యాయమూర్తి



**కాణిపాకం, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** ఒడిస్సా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిపీ.రౌత్రే శనివారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడులతో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఉపకేంద్రంలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

వెదురుకుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త :



మండలంలోని ఆళ్ళమడుగు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంను శనివారం టాస్క్ ఫోర్స్ కమిటీ జిల్లా గణాంకాధికారి జార్జ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. కేంద్ర కుటుంబ నియంత్రణ ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అధికారుల సూచనల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో పేద రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ పేదరోగులకు మెరుగైన వైద్యం అందించడం కొరకు వైద్య సదుపాయాలు కలిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ మురళి, కృష్ణా రెడ్డి, యంఎల్‌హెచ్‌పి పద్మా, జయంతి, గజేంద్రన్, నాని, ఎఎన్‌యం రేవతి, ఆశ కార్యకర్తలు రోశమ్మ, సుమతి, లత, వసంత తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబంలో ఓ వ్యాపారవేత్తను తయారుచేయడమే ప్రభుత్వ లక్ష్యం



**కుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త** ప్రతి కుటుంబంలోను ఓ వ్యాపారవేత్తను తయారుచేయడమే ప్రభుత్వ లక్ష్యమని కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర పేర్కొన్నారు. శనివారం కుప్పం మున్సిపాలిటీ పరిధి ఆర్‌పిల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ప్రతి సంఘ సభ్యుల ఆదాయం లక్ష రూపాయలకు తగ్గకుండా జీవనోపాధులు మెరుగుపరచుకోవాలని అందుకు అవసరమైన శిక్షణ, మార్కెటింగ్ వసతులు, ఆర్థికసాయాన్ని ప్రభుత్వం ద్వారా అందిస్తామన్నారు. కుప్పం మున్సిపాలిటీలో వీధి విక్రయదారులు వ్యాపారులు చేసుకునేందుకు స్మార్ట్ వెండింగ్ ప్రాంతాన్ని గుర్తించామన్నారు. ప్లంబర్, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్, ఏసి, గ్రీజర్, టివి, ఫ్రిజ్,వాషింగ్ మిషన్లు రిపేరు చేసేవారు, బ్యూటీషియన్ సేవలు అందించేవారికి ఎన్ఎస్‌డిసి, ఎస్‌డిసి, నాక్‌ద్వారా శిక్షణ ఇచ్చి అర్హత పొందిన వారికి హోం ట్రయాంగిల్ ప్లాట్‌ఫాం ద్వారా ఆన్‌బోర్డు చేసి జీవనోపాధి కల్పించడం జరుగుతుందన్నారు. వివరాలకు మెప్మా సిఓ జగదీష్ 9182978897నెంబరును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో ముందుకుసాగాలి



**కుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త** విద్యార్థులు గెలుపోటములు పట్టించుకోకుండా పట్టుదలతో ముందుకుసాగాలని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజు సూచించారు. శనివారం స్థానిక టేలర్ హైస్కూల్ విద్యార్థులు చేపట్టిన సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డా॥ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ సైక్లింగ్ ద్వారా ఆరోగ్యానికి మేలు కలుగుతుందన్నారు. ఈసందర్భంగా పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం సైకిల్ రేస్‌లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, పూర్వ విద్యార్థులు బిఎం దయానిధి, డా॥ సుదర్శన్, హఫీజ్, రూబీ, ప్రమోద్‌కుమార్, తౌసిఫ్, నాగార్జున, అహ్మద్, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారంకే రెవెన్యూ సదస్సులు

కుప్పం,డిసెంబర్ 28 ప్రభాతవార్త



రైతులు, ప్రజల భూ సమస్యల పరిష్కారంకే ప్రభుత్వ ఆదేశాల తో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ చిట్టిబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక మూడో వార్డు సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సును నిర్వహించారు. .కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, విఆర్వో శ్రీకాంత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, ఎంఆర్ సురేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, జనసేన నరేష్, బిజెపి శివశంకర్, నేతలు వాసు, జయరాంనాయుడు, మహిళా నేతలు భాగ్యలక్ష్మి త్రిలోక్, తిరు మగళ్, శారదమ్మ పాల్గొన్నారు.

## మండలస్థాయి సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రతిభ



**కుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త** కుప్పం బాలుర హైస్కూల్‌లో శనివారం మండల స్థాయి సైన్స్ ఫేర్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ పాఠశాలలనుంచి హాజరైన విద్యార్థినీ విద్యార్థులు పలు ప్రయోగాలను ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో చందం హైస్కూల్ వాటర్ లాక్ జెల్ ప్రయోగంతో మొదటిస్థానంలో నిలిచింది. అలాగే నూలుకుంట, వానగుట్టపల్లి హైస్కూళ్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. గ్రూప్ విభాగంలో దాసేగానూరు, కుప్పం ఆర్.పేట హైస్కూల్, టీచర్ల విభాగంలో పరమసముద్రం మోడల్ స్కూల్ విజేతలుగా నిలిచారు. వీరికి ఎంఇఒరాజారాం బహుమతులు అందించారు. కార్యక్రమంలో సిఆర్ఎంటిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

కుప్పంరూరల్, డిసెంబర్ 28 ప్రభాతవార్త



వడ్డెర కులస్తుల ఆరాధ్యదైవం వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వడ్డెర సంఘం నేతలు కోరారు. శనివారం స్థానిక పార్కులో వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణా రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి ఇదివరకే వడ్డె ఓబన్న జయంతిని అధికారిక పండగగా ప్రకటించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సైతం సిఎం చంద్రబాబునాయుడు వడ్డె ఓబన్న జయంతిని అధికారిక పండగగా ప్రకటించాలని కోరారు. అలాగే కుప్పం నియోజకవర్గంలో సుమారు ఇరవైవేల జనాభా ఉన్న వడ్డెర కులస్తుల సౌకర్యార్థం కుప్పంలో కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంల దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లినట్లు చెప్పారు. కుప్పంలో జనవరి 11న నిర్వహించే వడ్డె ఓబన్న జయంతికి వడ్డెర కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నేతలు మహదేవన్, వెంకటేష్, బాలు, మునిరత్నం, బేటప్ప, రవి, బాలు, చలపతి, శేఖర్ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## జగన్ అవినీతి వల్లే ప్రజలపై రూ. 1,29,000 కోట్ల భారం

ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



**పుత్తూరు, డిసెంబరు 28 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి అవినీతి కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలపై రూ. 1,29,000 కోట్ల భారం పడిందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెరిగాయని రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి నాయకులు ధర్నాలు చేసిన నేపథ్యంలో శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ విద్యుత్ ఛార్జీలు పెంచలేదని స్పష్టం చేశారు. అధికారంలో వున్నపుడు జగన్ చేసిన అవినీతి, తప్పులు విద్యుత్ ఛార్జీల రూపంలో ఇప్పటికీ ప్రజలను వెంటాడుతున్నాయన్నారు. వాటిని తగ్గించి ప్రజలపై భారం తొలగించేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. 22.5 మిలియన్ యూనిట్ల కొరత వున్న రాష్ట్రాన్ని 2019 నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ తీర్చిదిద్దిందని తెలిపారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి 2024 వరకూ ప్రజలపై రూ. 35 వేల కోట్ల విద్యుత్ భారం మోపడమే కాకుండా విద్యుత్ శాఖకు రూ. 1.20 లక్షల కోట్ల నష్టాన్ని తెచ్చిపెట్టారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి ప్రభుత్వంలో ఆమోదం పొందిన ట్రూ అప్ ఛార్జీలు ప్రజలపై పడ్డాయని వైసిపి డ్రామాలను ప్రజలు నమ్మరని, ధర్నాలో పాల్గొనాలని జగన్ ఇచ్చిన పిలుపునకు సొంత పార్టీలో కూడా స్పందన లేదని తెలిపారు.

## 126 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



**పుత్తూరు, డిసెంబరు 28 ప్రభాతవార్త :** ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 126 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు వైస్ ప్రిన్సిపాళ్ల డాక్టర్ జి.కోటేశ్వరయ్య, వి.వీరయ్య తెలిపారు. డిగ్రీ కాలేజీలో జెకెసి ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాలో 165 మంది పాల్గొనగా మొత్తం 10 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి 126 మంది విద్యార్థులకు ఉద్యోగ ధృవీకరణ పత్రాలు అందజేశారని తెలిపారు. ఇందులో పుత్తూరు డిగ్రీ కాలేజీ విద్యార్థులు 86 మంది ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు కలిగి వుండాలన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.బాబూరావు, అధ్యాపకులు డాక్టర్ సుజన, టి.కిశోర్, డాక్టర్ పి.హరిబాబు, డాక్టర్ సి.వెంకటకృష్ణయ్య, డాక్టర్ పి.శంకరరావు, డాక్టర్ టి.రఘురామ్ పాల్గొన్నారు.

## సాంబయ్యపాళెం విద్యార్థుల నైపుణ్యం



**తొట్టంబేడు, డిసెంబర్ 28 ప్రభాతవార్త** విద్యలో ఒదుగుతూ..నైపుణ్యంలో ఎదుగుతూ మండలంలోని దిగువసాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు నూతన సంవత్సరం మరియు సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని శనివారం ఆటవిడుపుగా గ్రీటింగ్ కార్డులను తయారు చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు బాల్యదశ నుంచే హస్త నైపుణ్యాలను కూడా మెరుగు పరచుకోవాలని, సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మోహనరాణి, వర్కర్ మాధవి విద్యార్థులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం



**.తొట్టంబేడు, డిసెంబర్ 28 ప్రభాతవార్త** గ్రామాల్లో పూర్తిస్థాయిలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని అందుకే ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారని తహశీల్దార్ మధుసూధనరావు తెలిపారు. శనివారం తంగేళ్ళపాళెం, గౌడమాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ ఉన్నం.కృష్ణమనాయుడు విచ్చేశారు.ఈసందర్భంగా తహశీల్దార్ మధుసూధనరావు మాట్లాడుతూ గ్రామాల్లో అన్నదాతలకు సమస్యలు ఉండకుండా రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరగకుండా ఉండేలా చూస్తామన్నారు. ప్రతి రైతు ఈసమస్యను పరిష్కరించుకోవచ్చని తహశీల్దార్ వివరించారు. సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి, సర్వేయర్ హరనాథ్ పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో వెయ్యిసభ్యత్వాలు

–శాశ్వత సభ్యత్వం పొందిన లక్కమనేనిమధు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 28 ప్రభాతవార్త** వారంరోజుల్లోనే వెయ్యిసభ్యత్వాలు పూర్తిచేశామని టిడిపి నేత లక్కమనేని మధు తెలిపారు. తాను కూడా శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి చేతులమీదుగా టిడిపి శాశ్వతసభ్యత్వం తీసుకున్నారు. తర్వాత తన పరిధిలో గల వార్డుల్లో తన అనుచరులతో కలసి ముమ్మరంగా తిరుగుతూ సభ్యత్వ నమోదు చేయిస్తున్నారు. తాను చేయించిన సభ్యత్వాలు వెయ్యిదాటడంతో శనివారం లక్కమనేని మధు తన కార్యాలయం వద్ద అభిమానులతో కలసి కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు, టిడిపి నాయకులు మదన్‌మోహన్‌నాయుడు, టిడిపి మైనార్టీ నాయకులు సాజిద్, యువనాయకులు సాలాపక్షి నవీన్, సోము, సుధాకర్, చరణ్, పవన్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, వంశీ, గిరి, ప్రమోద్, భార్గవ్, పురుషోత్తం, అజయ్, హర్షద్, పట్టణంలోని పలు వార్డులకు చెందిన టిడిపి యువత పాల్గొన్నారు.

## గిరిజనులకు ఇంటి స్థలాలు మంజూరు చేయండి



**సత్యవేడు, డిసెంబరు 28 ప్రభాతవార్త:** ఎన్నో ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నాం ఇంత వరకు రేషన్ కార్డు లేదు రెవెన్యూ సదస్సులోనైనా మంజూరు చేయాలని సత్యవేడు మండలం మదనంబేడు గిరిజనులు పలువురు అధికారులకు విన్నవించారు. శనివారం తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మదనంబేడు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు పరమశివం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ప్రజలు అధికార బృందానికి వినతులు సమర్పించారు. ఈ నేపథ్యంలో సీపీఎం మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో గిరిజనులు రేషన్ కార్డు, ఇంటి స్థలాలు ఇవ్వాలని అధికారులకు విన్నవించుకున్నారు. తమ కాలనీలో ఇప్పటికి 13 మంది కుటుంబాలకు ఇంటి స్థలాలు లేవన్నారు. అలాగే 8 మంది కుటుంబాలకు రేషన్ కార్డులు కూడా లేవని పేర్కొన్నారు. అలాగే తాము నివసిస్తు నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నెం.122/4లోని 5-73 సెంట్లను 22ఏ నుంచి తొలగించాలని బాధిత రైతు రామచంద్రయ్య అధికారులకు వినతి సమర్పించారు. కార్యక్రమంలో వీఆర్వో వినోద్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ మాధవి, మండల సర్వేయర్ చంద్రశేఖర్, సచివాలయ వీఆర్వో మధు, నాగార్జున, మోహన్‌రాజ్, సచివాలయ సర్వేయర్ షణ్ముగం పాల్గొన్నారు.

## కలుషిత నీటితో తప్పని తిప్పలు



**విజయపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త:** మండలంలోని చిన్న జంబాడ వద్ద రోడ్డు పక్కన నిలిచిన కలుషిత నీటితో ఇబ్బంది పడుతున్నదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చిన్న జంబాడలో ప్రైవేటు కర్మాగారం నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, కలుషిత నీరు యథేచ్ఛగా బయటకు వదలడం వలన ఇబ్బంది ఎదురవుతున్నదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రైవేటు కర్మాగారంవెలుపల చిన్న జంబాడ-కనకమ్మసత్రం రోడ్డు పక్కనున్న కాలువలో కలుషిత నీరు చేరి వర్షం కురిసినప్పుడు పొలాల మీద వెళ్ళడం వలన భూమి నిస్సారం కావడంతో పాటు పంటలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలు తెల్లని పాల రంగులో ఉండి వర్షపునీటితో చేరడంతో అవి కూడా రంగు మారి దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. రోడ్డు పక్కన కలుషిత నీరు వదలడం వలన పశువులు, మూగ జీవాలు దాహానికి ఆ నీటిని తాగి ప్రమాద బారిన పడుతున్నాయని పాడి రైతులు కంటతడి పెడుతున్నారు. ఈ విషయమై పర్యావరణ శాఖ అధికారులు కూడా పట్టించుకునే దాఖలు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే కలుషిత నీటిని ప్రత్యేక యంత్రాల ద్వారా శుభ్రపరచి వదలాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**- కనీస వేతనం 26,000 ఇవ్వాలి - రాష్ట్ర అధ్యక్షులు రాజారెడ్డి**



**తిరుపతి హెల్త్, డిసెంబర్ 28, ప్రభాతవార్త** రుయా ఆసుపత్రిలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాజారెడ్డి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాధాకృష్ణ లు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రాష్ట్రంలోనే పేరు ఉన్నా హాస్పిటల్స్ రుయా హాస్పిటల్ మెడికల్ కాలేజీ అలాగే స్విమ్స్ మేటర్నిటీ ఈఎస్ఐ హాస్పిటల్ ఎక్కువమంది మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ పనిచేస్తున్నారని వారికి కనీస వేతనం ఇవ్వడం లేదని, ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యాలు సరిగా అమలుపరచడం లేదని డిఎంహెచ్వో సంతకంతో గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదని అవసరానికి తగ్గ కార్మికుల సంఖ్య లేదని తక్కువ మంది కార్మికులతో ఎక్కువ పని చేసి కార్మికుల దోపిడీకి గురి అవుతున్నారని ఈ సమస్యలన్నీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆరవ మహాసభలు విజయవాడలో జరిగాయని అక్కడ చేసిన తీర్మాలను తీర్మానాలను వివరించడం కోసం తిరుపతి రుయా హాస్పిటల్ నందు సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని రానున్న కాలంలో పెద్ద ఎత్తున మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ హక్కుల కోసం కార్మికుల సంఖ్య కోసం జీతాల పెంపు కోసం కనీస వస్తువుల కోసం పెద్ద ఎత్తున పోరాటాలకు ఏఐటియుసి శ్రీకారం చుట్టబోతుందని ఆ కార్యక్రమాలలో మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ పెద్ద ఎత్తున పాల్గొనాలి అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి పుట్ట మహేంద్ర మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నరసింహులు రాష్ట్ర నాయకులు పురుషోత్తం కిషోర్, నాగభూషణం, కిషోర్ ముని వేలు, సునీల్, వరలక్ష్మి, సులోచన, రమణయ్య, పద్మ, కవిత, బుజ్జమ్మ, వనజ, ముని రాజమ్మపాల్గొన్నారు.

## స్విమ్స్ సర్జికల్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో 6వ వార్షిక చైర్ ఒరేషన్



**తిరుపతి హెల్త్, డిసెంబర్ 28, ప్రభాతవార్త** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ సర్జికల్ అంకాలజి శ్రీ పద్మావతి అడిటోరియంలో వాట్ ఈజ్ న్యూ ఇన్ చైర్ ఒరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు స్విమ్స్ ...ారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా ఆర్.వి. ...ు, మెడికల్ డైరెక్టర్ బసవతారకం ఇండో అమెరికన్ ...ాబాద్, స్విమ్స్ డీన్ డా. అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డా.అపర్ణ ఆర్ బిట్లా, శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా ఉషాకళావత్, కంట్రోల్ ఆఫ్ ఎక్సామినేషన్ డా. వనజాక్షమ్మ, సర్జికల్ అంకాలజి విభాగాధిపతి డా. నరేంద్ర, రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డా.సుబ్రమణియన్, ఫిజియోథెరఫీ ప్రిన్సిపాల్ డా మాదవిల సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ 6వ వార్షిక చైర్ ఒరేషన్ కార్యక్రమానికి ముఖ్య వక్తగా డా టి. సుబ్రమణ్యేశ్వరరావు, మెడికల్ డైరెక్టర్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్సిస్టిట్యూల్ హైదరాబాద్ నుంచి రావడం సంతోషదాయకమిని పేర్కొన్నారు. డా. టి.సుబ్రమణ్యేశ్వరరావు 2018వ సంవత్సరంలో స్విమ్స్‌ను సందర్శించి లైవ్ లాపరోస్కోపిక్ సర్జరీ నిర్వహించారని తెలిపారు. సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి డా. నరేంద్ర మాట్లాడుతూ డా. టి. సుబ్రమణ్యేశ్వరరావు ప్రస్తుతం బసవతారకం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కి మెడికల్ డైరెక్టర్, చీఫ్ ఆఫ్ సర్జికల్ అంకాలజిస్టుగా పనిచేస్తున్నారని, స్విమ్స్ నందు కూడా లైవ్ లాపరోస్కోపిక్ ద్వారా సర్జరీ నిర్వహించారని, అంకాలజీ విభాగంలో అత్యంత వైద్య నిపుణుడని తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ ముఖ్య అదితిగా విచ్చేసిన డా టి. సుబ్రమణ్యేశ్వరరావుకి మెమోంటోను ఇచ్చి శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. నాగరాజు డా. అలోక్ సచన్, డా. కళావత్, డా. ఇ. శ్రీహరి, డా.శ్రీనివాసరావు, సర్జికల్ అంకాలజీల వైద్యులు, ఇతర విభాగాధిపతులు, వైద్యులు పి.జి వైద్య విద్యార్థులు, యంబిబిఎస్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శివయ్య సన్నిధిలో శైవపీఠాధిపది



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 28 ప్రభాతవార్త** దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి తమిళ నాడు శైవపీఠాధిపతులు కుంభకోణం ధర్మపురం ఆధీనం మాసిలామణి దేశిగ జ్ఞానసంబంద స్వామి దర్శనానికి విచ్చే శారు. ఆయనకు ఏఈఓ లోకేష్‌రెడ్డి స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల ప్రత్యేకదర్శనం చేయించారు. అనంతరం స్వామి జీకి ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు. త్వరలో జరగబోవు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు స్వామిజీని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆహ్వానిం చారు.

## రిపబ్లిక్ దినోత్సవ పరేడ్‌కు విద్యార్థి ఎంపిక



**తొట్టంబేడు, డిసెంబర్ 28 ప్రభాతవార్త** స్థానిక ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు)లో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌సిసి క్యాడెట్ టి.గిల్ క్రిస్ట్ జనవరి 26న జరిగే రిపబ్లిక్ దినోత్సవ పరేడ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.నరసింహవర్మ తెలిపారు. 2025 సంవత్సరం రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో భాగంగా పరేడ్‌లో పాల్గొనేందుకు ఎన్‌సిసి 29వ ఆంధ్ర బెటాలియన్ పలు అంశాలకు సంబందించి నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో ఎన్‌సిసి విద్యార్థులు వివిధ స్థాయిలో ప్రదర్శించి ప్రతిభ ఆధారంగా గిల్ క్రిస్ట్ తిరుపతి జిల్లా ఎన్‌సిసి విభాగం నుంచి ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిష్టాత్మకమైన జాతీయ వేడుకల్లో పాలుపంచుకోబోతున్న విద్యార్థికి ఎన్‌సిసి అధికారి డాక్టర్ సి.బాపనయ్య, వైస్ ప్రిన్సిపల్ డా.టి.గంగారాం, పిడి డా.పి.సత్యనారాయణ, అకడమిక్ కో ఆర్డినేటర్ కె.సాయివెంకటేష్ మరియు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## పార్టీలో దంపూరి శాశ్వత సభ్యత్వం

**తిరుపతి(రవాణ), డిసెంబర్ 28ప్రభాతవార్త:** తిరుపతికి చెందిన టిడిపి రాష్ట్రకార్యదర్శి దంపూరి భాస్కర్‌యాదవ్ పార్టీలో శాశ్వతసభ్యత్వం అందుకున్నారు. శనివారం ఇన్‌ఛార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో లక్షరూపాయలు చెల్లించి ఈ సభ్యత్వం పొందారు.

## గంగమ్మ ఆలయానికి విరాళం



**తిరుపతి(రవాణ), డిసెంబర్ 28ప్రభాతవార్త:** తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరుగుతున్న నిర్మాణ పనులకు టిటిడి విశ్రాంత డ్రైవర్ 1,00,116రూపాయలు విరాళమిచ్చాడు. ఆర్.జగన్నాథం కుటుంబం ఈ విరాళాలను శనివారం ఆలయ ఈఓ జయకుమార్‌కు అందజేశారు. అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందించారు.

## కార్మికుల సంక్షేమమే ప్రధాన అజెండా



**రేణిగుంట, డిసెంబరు 28 ప్రభాతవార్త:** రైల్వే కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్) రేణిగుంట బ్రాంచ్ మజ్దూర్ సంఘ్ చైర్మన్ కటారు మాధవీలత అన్నారు. ఇటీవల జరిగిన రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో ఇండియన్ రైల్వేమెన్ ఫెడరేషన్ అనుబంధ సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రథమ స్థానం దక్కించుకుంది. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన గుంటకల్ డివిజన్ రేణిగుంట బ్రాంచ్(2) ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో కటారు మాధవీలత ను బ్రాంచ్ చైర్మన్‌గా, ఏ.మనోహర్‌ను వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రైల్వే ఉద్యోగులకు కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానన్నారు. మాధవీలతను నాయకులు, ఉద్యోగులు, కార్మికులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో జేసీఎస్ భరణి భానుప్రసాద్, డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, నాయకులు వేదమూర్తి, బ్రాంచ్ నాయకులు రాజన్, విజయకుమార్, రూపేష్, ప్రదీప్, శివ కుమార్, రాఘవ పాల్గొన్నారు.

## దారి లేకుండా అక్రమ నిర్మాణాలతో అడ్డుకట్ట

**-ఇంటిపట్టాలతో ఇళ్లు నిర్మించుకున్న ఇండ్లకు దారి చూపండి**



**తిరుపతి, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** వేదాంతపురంలో ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం ఇంటిపట్టాలు మంజూరు చేసిందని, ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్దిదారులకు దారి లేకుండా అక్రమ నిర్మాణాలు చేసారని లబ్దిదారులు వాపోయారు. ఈ మేరకు తిరుపతిరూరల్ తహశీల్దార్‌ను కలిసి విన్నవించారు. తహశీల్దార్ ఆదేశాల మేరకు ఆర్.ఐ. రఘువర్మ, సర్వేయర్ సంతోష్‌లు ఇంటిస్థలాలు మంజూరు చేసిన స్థలాలను పరిశీలించారు. వేదాంతపురం గ్రామ లెక్కదాఖల 224లో వున్న కాల్వను ఆక్రమించి, నిర్మాణాలు చేసారని, పట్టాలు పొందిన ఇండ్లకు దారి లేకుండా చేసారని లబ్దిదారులు రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఎలాగైన లబ్దిదారులకు దారి చూపాలని కోరారు.

## పెంగల్ తుఫానుకు వంద చెరువులకు గండ్లు

**రూ. 2.5కోట్లతో మరమ్మత్తులు ఎస్ఇ మదన గోపాల్**



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 28 ప్రభాతవార్త** మూడు నెలలుగా కురిసిన భారీ వర్షాలు, ఫెంగల్ తుఫాను, అల్పపీడనాలతో చెరువులు నిండాయని కొన్ని చెరువులకు గండ్లు పడ్డాయని ఇరిగేషన్ ఎస్ఇ మదనగోపాల్ శనివారం తెలిపారు. రైతులకు పంట నీరు అందించుటకు యుద్ధ ప్రాతిపదికపై 'ఉంగరపు కట్టలు' వేసి నీటినికాపాడామన్నారు. ఇందుకు సుమారు రూ.2.25కోట్లు నిధులు జిల్లా కలెక్టర్ మంజూరు చేసి రైతులకు సాగునీటికి ఇబ్బంది లేకుండా చేసారని వివరించారు. ఫెంగల్ తుఫాను ప్రభావంతో శ్రీకాళహస్తి మండలంలో 27 చెరువులకు గండ్లు పడగా రూ.62,70లక్షలతో పనులు చేపట్టినట్లు వివరించారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి మండలం రామాపురం గ్రామానికి చెందిన చెరువును ఉంగరపు కట్టతో మరమ్మత్తులు చేసి నీటిని కాపాడినట్లు వివరించారు. ఏర్పేడులో 4 చెరువులు దెబ్బతినగా రూ.1.65లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. రేణిగుంట మండలంలో రెండుచెరువులు దెబ్బతినగా రూ.9.5లక్షలు తొట్టంబేడు మండలంలో 12 చెరువులు దెబ్బతినగా రూ.19.50లక్షలు వెచ్చించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టామన్నారు. కాగా సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడులో మూడు చెరువులు దెబ్బతినగా రూ.3.9లక్షలతో మరమ్మత్తుల చేపట్టామన్నారు. వరదయ్యపాళెంలో 7 చెరువులు దెబ్బతినగా రూ.25లకలతో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టామన్నారు. బుచ్చినాయుడు కండ్రిగలో 11 చెరువులు దెబ్బతినగా రూ.21.30లక్షలతోమరమ్మత్తులు చేపట్టామన్నారు. కె.వి.బి.పురంలో 30 చెరువులు దెబ్బతినగా రూ.75.25లక్షలతో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టామన్నారు. నాగలాపురంలో ఒక చెరువు దెబ్బతినగా రూ.1.25లక్షలతో మరమ్మత్తులు చేసామన్నారు. పిచ్చాటూరు మండలంలో 3 చెరువులు దెబ్బతినగా రూ.4.85 లక్షలు మంజూరు చేసినట్లు మదనగోపాల్ వివరించారు.

## డాంగేను పరామర్శించిన బృందమ్మ



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మాజీ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ అద్దంకి డాంగే సతీమణి ఆకాల మరణం చెందడంతో శనివారం బొజ్జల బృందమ్మ పరామర్శించారు. పట్టణ యువత అధ్యక్షుడు అద్దంకి డాంగే మాతృమూర్తి అయిన అద్దంకి పద్మావతి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డాంగే, కిట్టులను పరామర్శించారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

**శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 28 ప్రభాతవార్త**

విద్యుత్ శాఖ పరిధిలోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసినట్లు తిరుపతిజిల్లా ఎస్ఇ పి.సురేంద్రనాయుడు తెలిపారు. శనివారం ఏర్పేడు మండలంలోని ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ వద్ద వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. సమావేశంలో లో వోల్టేజ్ సమస్య, ఇటీవల కురిసిన వర్షాలతో ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయాయని మరమ్మత్తులు చేపట్టాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని ఎస్ఇ సేకరించారు. ఈ సందర్భంగా రైతుల ఫిర్యాదుకు స్పందించిన ఎస్ఇ ఒక నెలలోపల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో శ్రీకాళహస్తి రూరల్ ఏడిఏ సుబ్రమణ్యం, శ్రీకాళహస్తిఏఈ నాగేశ్వరరావు, ఏర్పేడు ఎఇ వాసుదేవయ్య, జేయి రుతికమణి, వినియోగదారులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పొన్నారావు, ఆమందూరు సర్పంచ్ గుణశేఖర్‌యాదవ్, పంగూరుకుచెందిన శేషమ నాయుడు, మనోహర్‌నాయుడు, వెంకటకృష్ణమ్మనాయుడు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## హిందీ పరీక్షల్లో సత్తా చాటిన ఊరందూరు విద్యార్థులు



**శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 28 ప్రభాతవార్త** ఆంధ్ర ప్రదేశ్ హిందీ ప్రచార సభ నిర్వహించిన నాగరీబోధ్, ప్రవేశ, ప్రథమ, మధ్యమ, ఉత్తమ పరీక్షల్లో శ్రీకాళహస్తి మండలం ఊరందూరుకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటి జిల్లాలో ద్వితీయస్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి శనివారం తెలిపారు. ఈ మేరకు సత్తా చాటిన విద్యార్థులను పాఠశాలలో సన్మాన సభను ఏర్పాటు చేసారు. పాఠశాల నుంచి 32 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ప్రథమ శ్రేణిలో నిలిచారని ఆమె వివరించారు. ఉత్తమ పరీక్షల్లో 90 మార్కులతో 9వ తరగతి విద్యార్థులైన చరణ్‌కుమార్, శరణ్య, జ్యోతి జిల్లా స్థాయిలో సంయుక్తంగా ద్వితీయ ర్యాంకు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి తెలిపారు. పాఠశాల తరఫున హిందీ పండిట్ మల్లికార్జున్‌ను ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## శ్రీకాళహస్తిలో గౌరమ్మ గ్రామోత్సవం:



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 28 ప్రభాతవార్త** దక్షి కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెల నెలా ఓ ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ధనుర్మాసం నెల రోజుల పాటు గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహించటం ఆనవాయితి. శనివారం అమ్మవారిని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఏడాది ఉత్సవాలకు కొత్తగా ఉభయదారులుండటంతో వారు కూడా పాల్గొన్నారు. ధనుర్మాసం సందర్భంగా అమ్మవారు గొబ్బెమ్మగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో దేవేరిని కన్నుల పండువగా అలంకరించి బోయిలు మోసుకుంటూ శివయ్య మండపం నుంచి రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ నుంచి వాహనంపై అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు. టెంపుల్ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం దఫేదారు వారి సహచరులు వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా ఉత్సవం సాగింది.

## ఎన్ఎస్‌యూలో సంస్కృత విద్యార్థుల క్రీడామహోత్సవం ప్రారంభం

**తిరుపతి విద్య డిసెంబర్ 28 ప్రభాత వార్త:** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వేదికగా నాలుగు రోజుల పాటు జరగనున్న సౌత్ జోన్ సంస్కృత విద్యార్థుల క్రీడా మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సౌత్ ఇండియా క్రీడా భారతి జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ జాగిర్దర్ క్రీడాజ్యోతి ప్రజ్వాలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృత విద్యార్థులలోని క్రీడాప్రతిభను వెలికితీయడానికి సౌత్ జోన్ క్రీడామహోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. భారతీయ ప్రాచీన క్రీడలకు పూర్వవైభవం తీసుకురావాలని, భారతప్రభుత్వం ఖేలో ఇండియా పథకం ద్వారా ఎంపికైన విద్యార్థులకు ప్రతినెల క్రీడాశిక్షణకు రూ.50వేలు అందిస్తోందన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం కొరకు ఈ క్రీడామహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, మన భారతీయ క్రీడలైన ఆర్చరీ, చదరంగం, కరస్రాము, మల్లయుద్ధం వంటి క్రీడలను విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ రజనీకాంత్ శుక్లా, ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, రిజిస్ట్రార్ రమాశ్రీ, పీడీ సేతురామ్, డాక్టర్ కనపాల కుమార్, డాక్టర్ గిరికుమార్, పలు వర్సిటీల నుంచి విచ్చేసి సంస్కృత విద్యార్థులు పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో శనీశ్వరాభిషేకాలు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం త్రయోదశి సందర్భంగా రికార్డు స్థాయిలో పూజలు జరిగినట్లు ఆలయ ఇఒ టి.బాపిరెడ్డి ప్రకటించారు. సాధారణంగా శనివారం ఆలయంలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. త్రయోదశి రాగా శనీశ్వరాభిషేకాలకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. త్రయోదశి సందర్భంగా ఏలిన నాటి శని ప్రభావం పరిష్కారమౌతుందని ప్రచారం జరగటంతో 588 శనీశ్వరాభిషేకాలు జరిగాయి.

# తిరుపతి డివిజన్

## ఓలేటి భౌతిక కాయానికి పులివర్తి నివాళి



**చంద్రగిరి, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** టిడిపి సీనియర్ నాయకుడు దివంగత ఓలేటి దేవరాజులు నాయుడు భౌతిక కాయంపై ఎంఎల్ఏ పులివర్తి నాని పూలమాలవేసి నివాళుల ర్పించారు. మండల పరిధిలోని కాశిపెంట్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు దేవరాజులు రెడ్డి మరణ సమాచారం తెలుసుకున్న ఎంఎల్ఏ శనివారం ఉదయం ఇక్కడికి చేరుకున్నారు. మృతుడి పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దేవరాజుల నాయుడు మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ టిడిపి నాయకులు ఏజి పల్లి బాల, గౌస్‌భాషా, గాలి సతీష్, దొమ్మలపాటి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో శ్రీనివాసుడు



**చంద్రగిరి, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీనివాసుడు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారికి ధనుర్మాస కైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ ఈ.రాజకుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, మదన్‌కుమార్, అర్చకులు కేనమాకుల పల్లి రాజు, ఆలయ సిబ్బంది సుబ్రమణ్యం, రవిచంద్రన్, ఘనాపాటి తిరువెంగాడం, జమేదర్ మంకు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ టివిలను ఉపయోగించి విద్యార్థులకు పాఠాలు చెప్పాలి



**పాకాల, డిసెంబర్ 28, ప్రభాతవార్త** పాకాల మండల విద్యా శాఖాధికారి బాబ్జి శనివారం మండలంలోని పదిపుట్ల బయలు ప్రాథమికోన్నత పాఠశాల, గుండ్ల గుట్ట పల్లి, తురక పల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎం ఈ ఓ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేసిన స్మార్ట్ ఎల్ఈడి టివిలను ఉపయోగించి విద్యార్థులకు పాఠాలు చెప్పాలని ఉపాధ్యాయులకు చెప్పారు. ప్రతి సబ్జెక్ట్ యొక్క పాఠాలకు సంభందించిన విషయాలను వివరనాత్మకంగా పెన్ డ్రైవ్‌లోకి సమకూర్చుకొని విద్యార్థులకు తరచూ వివరించాలని వారు కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ విద్యార్థులకు అవసరం మేరకు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థుల దగ్గర ప్రాజెక్ట్ వర్క్ చేయించాలని కోరారు. పాఠశాలల్లో ఉపయోగించే వివిధ రకాల రిజిస్టర్స్, రికార్డ్స్ పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రమీలమ్మ, చెంగల్ రాయులు, ఖాదర్ బాషా, ఉపాధ్యాయులు మోహన్, శ్రీనివాసులు, సాబీర బేగం, సిఆర్‌పి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రజా సేవలు అందించిన వారికి రతన్ టాటా ఉత్తమ సేవా అవార్డులు



**పాకాల, డిసెంబర్ 28, ప్రభాతవార్త** పాకాల మండలం దామలచెరువు పంచాయతీ పత్తిపాటివారిపల్లి మహాప్రస్థానా ట్రస్ట్ ఆధ్వర్యంలో రతన్ టాటా జయంతి సందర్భంగా సేవలందించిన వారికి శనివారం రటన్ టాటా ఉత్తమ సేవ అవార్డులను ప్రధానం చేశారు. రతన్ టాటా జయంతి సందర్భంగా మహా ప్రస్థాన ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంకితభావంతో ప్రజాసేవ చేసిన వారికి, వివిధ శాఖలో పనిచేస్తున్న అధికారులకు, ఉత్తమ సేవలు అందించిన జర్నలిస్ట్‌లకు, 99 టివి జర్నలిస్ట్ ప్రతాప్ రెడ్డిని మహాప్రస్థానా ట్రస్ట్ ఆధ్వర్యంలో శాలువా కప్పి, రతన్ టాటా ఉత్తమ సేవా అవార్డు షీల్డ్‌ను ఎం ఈ ఓ బాబ్జి చేతుల మీదుగా ప్రధానం చేసారు. రతన్ టాటా జయంతి సందర్బంగా మహాప్రస్థానా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజా సేవలు అందించిన వారికి రతన్ టాటా ఉత్తమ సేవ అవార్డ్స్ ప్రధానం చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## దామినేడు ఫ్లాట్స్, గృహ బాధితుల బాధలను అర్థం చేసుకోండి



**తిరుపతి హెల్త్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** దామినేడు ఫ్లాట్స్, గృహ బాధితుల దాదాపు 2500 మంది బాధలను అర్థం చేసుకుని ప్రభుత్వం వెంటనే 22 ఏ బ్యాన్‌లో ఉన్న భూమిని ఎత్తి వేసి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని దామినేడు ఫ్లాట్స్, గృహ బాధితులు ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు తులసి ప్రసాద్, సిద్దానాయక్, రవిచంద్రారెడ్డి, పెంచల రత్నయ్య, శేషారెడ్డి, మునిరత్నం, తదితరులు మాట్లాడారు. దామినేడు లెక్క దాఖలలో మొత్తం మీద 459 ఎకరాలలో దాదాపు 2500 మందికి పైగా బాధితులు ఉన్నామని, ఇందులో ఐదు మందికి కేవలం 192 ఎకరాలు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించి, మిగతా 262 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా 2008 సంవత్సరంలో 22 ఏ ప్రభుత్వం భూమి క్రింద రెవెన్యూ అధికారులు, క్రింది స్థాయి సిబ్బంది ప్రభుత్వానికి చూపడం దారుణమన్నారు. నాటి నుంచి నేటి వరకు 20 సెంట్ల నుంచి వంద సెంట్ల వరకు కొనుగోలు చేసిన లబ్దిదారులు నానా ఇబ్బందులకు గురి అవుతున్నామని బాధపడ్డారు. ఇకనైనా సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సంబంధిత మంత్రి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తమ బాధలను అర్థం చేసుకుని 22ఏ బ్యాన్ కింద ఉన్న భూమిని వెంటనే రద్దు పరచి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించడంతో పాటు తమ కుటుంబాలను, పిల్లలను, వారి బిడ్డలను ఆదుకోవాలని కోరారు.

## అలరించిన అన్నమయ్య కీర్తనల నృత్య ప్రదర్శన

**తిరుపతి విద్య, డిసెంబర్ 28 ప్రభాత వార్త:**



ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియం వేదికగా బంజారా జన సంఘ్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరగుతున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు వీక్షకులను అలరింపజేశాయి. ఇందులో భాగంగా రెండవ రోజు శనివారం విద్యార్థులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనల ఆలాపన, భరతనాట్య ప్రదర్శన కనుల విందుగా కొనసాగాయి. ఈ సందర్భంగా బీజేఎస్ అధ్యక్షులు హరి చౌహాన్ నాయక్ మాట్లాడుతూ అంతరించిపోతున్న భారతీయ సాంస్కృతిక కళా సంపదను భావిభారతానికి తెలియజేయాలనే ప్రధాన లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీవారి ఘన చరిత్రతో పాటు పాచికలు ఆడిన సందర్భం, హథీరాం బావాజీ జీవిత చరిత్ర, ఆయన తిరుమల ఆగమనంపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. తరిగొండ వెంగమాబ భక్తి జీవనం, సాంస్కృతిక జానపద కళలు, కోలాట ప్రదర్శనలు అలరించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీ మోహన్, వీసీ అప్పారావు, బంజారా జన్ సంగ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్ నాయక్, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ నాయక్, వినోద్ రాథోడ్, ప్రియాంక నాయక్, హేమంత్ నాయక్, నాగేంద్ర నాయక్, కిషోర్ నాయక్, లలిత, హరి నాయక్, లచ్చి రామ్ నాయక్, పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెటర్నరీలో యూత్ పార్లమెంట్

**తిరుపతి విద్య డిసెంబర్ 28 ప్రభాత వార్త:**



ఎస్వీ వెటర్నరీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యువ మంథన్ యూత్ పార్లమెంట్ అండ్ యూఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువతను దేశాభివృద్ధిలో భాగం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా దేశ ఆర్థిక వ్యవస్థలో పశువైద్యం, వ్యాధి నివారణ, మౌలిక అవసరాల ప్రాముఖ్యత, గ్లోబలైజేషన్ లో పశువైద్య పాత్రపై సుదీర్ఘంగా విద్యార్థులు చర్చించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, డాక్టర్ వేణు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ అమరావతి, డాక్టర్ వెంకటేశ్వర్లు, రాజా, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## వచ్చేనెల 3 నుంచి పీజీ పరీక్షలు

**తిరుపతి విద్య డిసెంబర్ 28 ప్రభాత వార్త:** ఎస్వీయూ పరిధిలో ఈనెల 30 నుంచి జరగవలసిన పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మూడే దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 3 వ తేదిన తిరిగి పరీక్షలు ప్రారంభమవుతాయని ఈ మేరకు అధికారులు. నిర్ణయించారని పేర్కొన్నారు. విద్యార్థులు మార్పును గమనించాలని, అన్ని కళాశాల యాజమాన్యాలకు ఇప్పటికే సమాచారాన్ని అందించామని తెలిపారు.

## ఎగ్జిక్యూటివ్ కోటా పీ హెచ్ డి అడ్మిషన్స్‌కు ఆహ్వానం

**తిరుపతి విద్య డిసెంబర్ 28, ప్రభాతవార్త :**ఎస్వీయూ ఎగ్జిక్యూటివ్ కోటాలో పీ హెచ్ డీ చేరదలచిన వారు జనవరి 21తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో ప్రవేశం పొందాలంటే పది సంవత్సరాల ప్రభుత్వ, ప్రైవేటు, పారిశ్రామిక రంగాలలో కార్యనిర్వాహక అధికారిగా అనుభవం, గ్రూప్ వన్ సర్వీస్ హోదాకి సమానమైన సర్వీస్ లో నెలకు లక్ష రూపాయల వేతనం కలిగి ఉండాలనీ, ప్రైవేట్, పారిశ్రామిక రంగాల వారైతే 25 కోట్ల పైబడిన వ్యాపార లావాదేవీలు కలిగి ఉండి, అందుకు సంబంధించిన ఆడిట్ రిపోర్ట్ జతపరచాలని పేర్కొన్నారు. అదేవిధంగా అభ్యర్థులు కనీసం రెండు సంవత్సరాల ఆదాయ పన్ను శాఖ జమఖాతాను జతపరచాలని, ప్రసిద్ధ జర్నల్స్ లో ప్రచురితమైన రెండు పరిశోధన వ్యాసాలనకలు జతపరచాలని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్సైట్ ను సంప్రదించాలని సూచించారు.

# గూడూరు డివిజన్

## పట్టపగలే మహిళ మెడలో గొలుసు అపహరణ

తడ, డిసెంబర్ 28 ప్రభాతవార్త

తడలో శనివారం పట్టపగలే మహిళ మెడలో బంగారు గొలుసు తెంపుకొని వెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. స్థానిక నిప్పో ఫ్యాక్టరీ ఎదురుగా చిల్లర దుకాణం నడుపుకుంటున్న చీకోలు లక్ష్మి షాపులో ఒంటరిగా ఉన్న సమయాన చెన్నై వైపు వెళుతున్న మోటార్‌సైకిలిస్ట్ అక్కడ ఆగి మంచినీటి బాటిల్ కావాలని షాపులోకి వచ్చి మహిళ మెడలో బంగారు గొలుసు తెంపుకొని వేగంగా బైకులో వెళ్లిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. మధ్యాహ్నం 2.30 గంటల సమయాన ఈ సంఘటన జరిగిందని, మూడు సవర్లు బంగారు గొలుసును గుర్తుతెలియని యువకుడు తెంపుకొని వెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. తడ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

## చేతి వృత్తుల వారికి విరివిగా ఉపాధి అవకాశాలు

### మెప్మా పీడీ డాక్టర్ రవీందర్ బాబు



వెంకటగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త

నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా చేతివృత్తుల వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని జిల్లా మ్యాప్ పిడి డాక్టర్ రవీందర్ బాబు తెలిపారు. వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో వారి వారితో స్కిల్ డెవలప్మెంట్ సమావేశం నిర్వహించారు. ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రిషన్ ,ఏసి ,వాటర్ హీటర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ , బ్యూటిషన్‌ల వారి వివరాలను ఈనెల 31వ తేదీ వరకు నమోదు చేసుకుంటామని తెలిపారు. జనవరి నెల ఒకటో తేదీ నుండి ఏడో తేదీ వరకు సర్వీస్ ప్రొవైడర్ కోసం రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హత కలిగిన వారు ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్ పుస్తకం, రెండు ఫోటోలు, తీసుకొని మున్సిపల్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కలిగిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేతి వృత్తులలో నైపుణ్యం కలిగిన వారికి పలు అంశాలపై ప్రమీల, శంకర్, శ్రీధర్ వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీధర్, సిఎం ఎంఆర్ సురేంద్ర సీసీలు వెంకటేశ్వర్లు, దుర్గేష్, తదితరులు పాల్గొన్నారు.

## చిట్టేడులో రెవెన్యూ సదస్సు

కోట, డిసెంబర్ 28 ప్రభాతవార్త

కోట మండలం చిట్టేడు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు తహశీల్దార్ కె.జయజయరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు రెవెన్యూ సదస్సులు సువర్ణ అవకాశమన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలను పరిష్కరించుకునేందుకు ఒకవేదిక లాంటిదన్నారు. ఇంటి నివేశన స్థలాల కోసం 42 అర్జీలు రాగా, ఆరు అర్జీలు రీ సర్వే కోసం అందినట్లు తెలిపారు. అర్జీలను పరిశీలించి 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్, ఆర్ఐ మధులత, సర్వేయర్ గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాలివీడు ఎంపిడిఓపై దాడికి నిరసన




కోట, డిసెంబర్ 28 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా గాలివీడి ఎంపిడిఓ జవహర్‌బాబుపై వైసీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, అతని అనుచరులు దాడి చేయడంపై శనివారం కోట ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ వేణు మాట్లాడుతూ గది తాళాలు ఇవ్వలేదని వైసీపీ నేత సుదర్శన్‌రెడ్డి, అతని అనుచరులు మూకుమ్మడిగా దాడి చేసి ఎంపిడిఓని విచక్షణారహితంగా కొట్టడం దారుణమన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో కోట, చిట్టమూరు, వాకాడు మండల పరిషత్ ఉద్యోగులు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటా సర్వే పారదర్శకంగా ఉండాలి

కోట, డిసెంబర్ 28 ప్రభాతవార్త

కోట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వాకాడు, చిట్టమూరు, కోట మండలాల పంచాయతీ కార్యదర్శులకు స్వమితపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు డిఎల్‌పిఓ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లోని ప్రతి ఇంటిని సర్వే చేసి ఆ వివరాలు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. స్వమిత కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని చెప్పారు. సకాలంలో సర్వే పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఎంపిడిఓ వేణు కోరారు. ఈ కార్యక్రమంలో స్వమిత ట్రైనర్ మనోజ్, సురేంద్ర, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటా

### ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్

గూడూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని ఆర్యవైశ్య సంఘాల గౌరవాధ్యక్షుడు సోమిశెట్టి చెంచురామయ్య నివాసంలో ఆర్యవైశ్యులతో ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని ఆర్యవైశ్యులందరూ ఒక తాటి మీదకు వచ్చి ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో తనకు అండగా నిలిచి విజయాన్ని అందించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. గూడూరు పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘాల నాయకులు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించి, వెండి కిరీటాన్ని బహుకరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పరిధిలోని పలు ఆర్యవైశ్య సంఘాలు, యూనియన్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో భగవద్గీత కంఠస్థ పోటీలు



సూళ్లూరుపేట, డిసెంబర్ 28 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలోని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు శ్రీ భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో 5 కేటగిరిలలో పోటీలు నిర్వహించి మొదటి కేటగిరిలో జి.లక్ష్మి, అన్విత, సుంకర దుస్తర్ బహుమతులు అందుకున్నారు. రెండవ కేటగిరిలో మొదటి బహుమతి బి.కార్తీక, రెండో బహుమతి ఎ.కావ్య, మూడో బహుమతి ఎస్‌డి నదీమ్ కైవసం చేసుకున్నారు. మూడో కేటగిరిలో లాస్య, అమృత, మానస బహుమతులు అందుకున్నారు. నాలుగో కేటగిరిలో సాయిప్రియ, వేదవతి, ప్రశాంతి బహుమతులు కైవసం చేసుకున్నారు. వయోజన స్త్రీ, పురుషుల కేటగిరిలో రాము, ఉషా, పుష్పాలు బహుమతులు పొందారు. కన్సొలేషన్ బహుమతులు 400 మంది వరకు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో సుమారు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేనాటి ధనంజయరెడ్డి, సూరా కమ్మిరెడ్డి, సుంకర ప్రతిమ, వి.శివప్రసాద్‌రెడ్డి, యారాశి, గోపి, లీలాకుమార్, దేవేంద్రరెడ్డి, కృష్ణారెడ్డి, ఉషామమత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సహకరించాలి




చిల్లకూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని మండల అధ్యక్షురాలు తుపాకుల వెంకటరమణ అన్నారు. శనివారం మండల పరిస్థితి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఆధార్ కార్డులు లేవని జనన మరణ సర్టిఫికెట్లు కూడా చాలామందికి పెండింగ్లో ఉన్నాయని వాటిని సత్వారం పరిష్కరించాలన్నారు. సీజను వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఇటీవల కురిసిన వర్షాలకు గుంటల్లో చెరువులు బావులు వద్ద బ్లీచింగ్ క్లోరిన్ చాలాలన్నారు మలేరియా డెంగు ఫీవర్ అరికట్టేందుకు దోమల నివారించాలన్నారు అదేవిధంగా ఇల్లు లేని ప్రతి ఒక్కరూ జనవరి నుండి నిర్మించుకుంటే వారికి ప్రభుత్వం నుండి వచ్చే నగదు సత్వరం అందజేస్తామన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని వాటి ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలని వారు తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి కొన్ని శాఖలు అధికారులు హాజరు కాకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోపి, ఆఫీస్ ఏఈలు ఇలియాజ్, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులు ధర్నాలు చేయడం హాస్యస్పదం

### ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్



గూడూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో 2019 నుండి 2024 వరకు నడిచిన వైసిపి ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై లక్షల కోట్ల రూపాయలు భారం వేయడంతోపాటు విద్యుత్ సంస్థను నష్టాల్లోకి తీసుకువెళ్లిన ఘనత వైసీపీది అయితే తామేదో విద్యుత్ చార్జీలు పెంచామని గగ్గోలు పెడుతూ వైసీపీ నాయకులు ధర్నాలు చేయడం హాస్యస్పదంగా ఉందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఎద్దేవా చేశారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతూ విద్యుత్ చార్జీలు చారని అసత్య ప్రచారాలు చేస్తూ వైసిపి నాయకులు ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసు కాబట్టి వైసిపి నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాలకు ప్రజల నుండి స్పందన రాలేదని గూడూరు వైసిపి నాయకులు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పట్టణానికి చెందిన ఎవరు పాల్గొనక పోవడం ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బిల్లు చెంచురామయ్య అబ్దుల్ రహీం కోటారెడ్డి కర్ణాకర్ రెడ్డి కందల బాలయ్యతదితరులు పాల్గొన్నారు.

## సర్వీస్ ప్రొవైడర్లు వినియోగదారులకు మధ్య అనుసంధానం ట్రయాంగిల్ యాప్

### మెప్మా పిడి రవీంద్ర



గూడూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

సర్వీస్ ప్రొవైడర్లు వినియోగదారులకు మధ్య అనుసంధానంగా ట్రయాంగిల్ యాప్‌ను నూతనంగా తీసుకురావడం జరిగిందని దీని కొరకు పేర్లు నమోదు చేసుకోవాలని తిరుపతి జిల్లా మెప్మా పిడి రవీంద్ర కోరారు. శనివారం గూడూరు పట్టణంలో పురపాలక సంఘ కార్యాలయంలో పలు రకాల సర్వీస్ ప్రొవైడర్లతో పిడి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ ప్రజలకు ఫ్రిడ్జ్, ఏసి రిపేరు ఎలక్ట్రీషియన్ ప్లంబర్ సమస్యలు ఎదురైనప్పుడు వాటిని రిపేరు చేసేందుకు మెకానికుల కొరకు వెతుకుతుంటారని తెలిపారు. దీని కొరకు ప్రభుత్వం ట్రయాంగిల్ యాప్‌ను తీసుకువచ్చిందని దీనిలో మెకానిక్ లందరూ రిజిస్ట్రేషన్ చేసుకుని పేర్లు నమోదు చేసుకుంటే ప్రజల వారికి అవసరమైన వారిని యాప్ ద్వారా సంప్రదిస్తారని పేర్కొన్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు పలు రకాల సర్వీస్ ప్రొవైడర్లతో సమావేశం నిర్వహించామని తెలిపారు త్వరలో యాప్ అందరికీ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ,సిటీ మేనేజర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన వైద్యారోగ్యశాఖ అధికారి



గూడూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలో గూడూరు శాసన సభ్యులు డా. పాశం సునీల్ కుమార్‌ని తిరుపతి జిల్లా వైద్యా రోగ్యశాఖ అధికారి డా. బాలకృష్ణ నాయక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం నియోజకవర్గ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సమస్యలు గురించి చర్చించారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని తిరుపతి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.బాలకృష్ణ నాయక్ చెప్పారు. అనంతరం పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం బానిగిస్సా హెబ్ పేటను పరిశీలించి రికార్డ్స్‌ను పరిశీలించి, అసహనం వ్యక్తం చేసారు. రేపు నెలలో మళ్లి వస్తానని పద్ధతి మార్చుకోవాలని సూచించారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి. శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సాధించాలి

### కెవికె ఉద్యాన శాస్త్ర వేత్త డా. డి. తిరుపాల్

బాలాయపల్లి, డిసెంబర్ 28 ప్రభాతవార్త

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త డాక్టర్ డి తిరుపాల్ తెలిపారు. వ్యవసాయంలో భాగంగా పల్లిపాడు గ్రామంలోనీ ప్రకృతి వ్యవసాయం రైతుల పొలాలలో ద్రవ జీవామృతం, అజ్ఞాస్త్రం, బ్రహ్మాస్త్రంల తయారీ పై ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయం లో పురుగు మందుల వాడకం మరియు రసాయన ఎరువులు వాడకం ను తగ్గించి, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని తద్వారా పెట్టుబడి తగ్గి, రసాయన రహిత దిగుబడులను సాధించవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రకృతి వ్యవసాయం ఏపీ సీఎం ఎఫ్ సిబ్బంది పి. వెంకటేశ్వర్లు, పవన్ కుమార్‌లు, రైతులు పాల్గొన్నారు.

## జైల్లో వైసిపి నేతను కలిసిన నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త

రిమాండ్ అనుభవిస్తూ నెల్లూరులోని జైల్లో ఉన్న వైసీపీ నాయకుడు తంగ పేచే రాజును నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పరామర్శించారు. అక్రమ కేసు పెట్టి జైలుకు పంపారని నేదురుమల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయపరంగా పోరాడి జైలు నుండి బయటకు తీసుకొస్తానని పేచి రాజుకు భరోసా ఇచ్చారు. అక్రమ కేసులకు వైసిపి కార్యకర్తలు నాయకులు భయపడవద్దని తెలిపారు. ఆయన వెంట దక్కిలి బాలాయపల్లి మండల జెసిఎస్ కన్వీనర్లు చింతల శ్రీనివాసులు రెడ్డి, వెన్నోటి కార్తీక్ రెడ్డి, పలువురు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## 31న పెన్షన్లు పంపిణీ

బాలాయపల్లి, డిసెంబర్ 28, ప్రభాతవార్త

2025 జనవరి నెల నూతన సంవత్సరం దృష్ట్యా ఒక రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు ఈనెల 31వ తేదీన పెన్షన్ల పంపిణీ చేస్తామని చెప్పారు. సచివాలయం సిబ్బంది పూర్తి చేయాలని కోరారు.

## 4న కార్యదర్శులు, సర్వేయర్‌లకు శిక్షణ

బాలాయపల్లి, డిసెంబర్ 28, ప్రభాతవార్త

జనవరి నెల నాలుగో తేదీ వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు ఈ ఏ లకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో వీరికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

## ఐఎన్‌టిఎస్‌ఓ లెవెల్ 1 పరీక్షలో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ

గూడూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఐఎన్‌టిఎస్‌ఓ లెవెల్ 1 పరీక్షలో గూడూరు శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ లెవెల్ 1 ఒలంపియాడ్ పరీక్షలో 338 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొంది లెవెల్ 2 కి అర్హత సాధించారు. ఇందులో మ్యాథ్స్ విభాగానికి సంబంధించి 105 మంది విద్యార్థులు ఇంగ్లీష్ విభాగానికి సంబంధించి 95 మంది విద్యార్థులు, సైన్స్ విభాగానికి సంబంధించి 59 మంది విద్యార్థులు, జనరల్ నాలెడ్జ్ విభాగానికి సంబంధించి 48 మంది విద్యార్థులు, అరిథమెటిక్ విభాగానికి సంబంధించి 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల ప్రాంగణంలో అభినందన సభను ఏర్పాటు చేసి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆ పాఠశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాసులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్నటువంటి ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి ఒలంపియాడ్ ఎగ్జామ్స్ ఎంతగానో దోహదపడుతున్నాయని తెలియజేశారు. అనంతరం ఆ పాఠశాల ఏజిఎం ఎన్. శ్రీకాంత్ మాట్లాడుతూ 338 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం మిగతా విద్యార్థులకు స్ఫూర్తిదాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్లు శ్రీహరిబాబు,హరి బ్రహ్మ యాదవ్, గాంధీ, ప్రైమరీ ఇంచార్జి చందన, ప్రీ ప్రైమరీ ఇంచార్జి కిరణ్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు చేయాలి

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి



వెంకటగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోనే ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మహిళలందరూ ఎప్పుడు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారని ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అమ్మకు వందనం డబ్బులు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ సీజన్ లో రైతులకు రుణాలు పనిముట్లు కూడా ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. గూడూరు వెంకటగిరి రోడ్డు అధ్వానంగా ఉన్న పట్టించుకోలేదని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## సుదర్శన్ రెడ్డిని కఠినంగా శిక్షించాలి



వాకాడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

ఎంపీపీ భవనం తాళాలు ఇవ్వనందుకు ఎంపీడీవో జవహర్ బాబు విధులో ఉండగా వైసీపీ నేత సుదర్శన్ రెడ్డి దౌర్జన్యం చేయడంతో సుదర్శన్ రెడ్డిని కఠినంగా శిక్షించాలన్నారు. శనివారం వాకాడు మండల పరిషత్ ఎంపీడీవో అన్నపూర్ణ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అన్నపూర్ణ రావు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా గాలివీడు జవహర్ బాబు విధుల్లో ఉండగా విధులను ఆటంకం పరుస్తూ ఆటవిక దాడి చేసిన ఎంపీపీ కుమారుడు వైసీపీ నేత సుదర్శన్ రెడ్డి ని కఠినంగా శిక్షించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మీద దాడులకు పాల్పడిన ఆలోచన రావాలంటే వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు, జవహర్ బాబు కు సంఘీభావంగా తెలిపారు. ఈ నిరసనల్లో ఏవో శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోండి తాసిల్దార్

వాకాడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవిన్యూ సదస్సును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ రామయ్య అన్నారు. శనివారం వాకాడు మండలం కొత్తచెరువు, గూండ్లు గ్రామాలలో సర్పంచ్ సిద్దారెడ్డి మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేర్లు మార్పులు, వన్ బి, అడంగల్ లో తప్పులున్న రైతులు మార్చుకోవాలి అన్నారు. తాసిల్దార్ రామయ్య మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చినటువంటి అర్జీలను సత్వరమే పరిష్కరించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శకుంతల, వీఆర్వో హరిబాబు, సర్వేయర్లు కీర్తి, శ్రీలత, వివిధ శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్‌చే సేవా కార్యక్రమాలు



చిల్లకూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

చిల్లకూరు మండలంలోని శారద నగర్ శారదా నగర్ ప్రాంతంలోని చెరువు కట్ట వద్ద ఉన్న గిరిజన కాలనీలో రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ అధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. రావుల ఉమా మహేష్, సుమల గారాలపట్టి చిన్నారి హవిస్మితి జన్మదినం సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. పేద గిరిజనులకు దుప్పట్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నాశిన నాగులు మాట్లాడుతూ క్లబ్ అధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దుప్పట్లు పంపిణీ చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, చోళవరం గిరిబాబు, శ్రీకంటి రామ్మోహన్ రావు, దువ్వూరు రవీంద్రా రెడ్డి.బొమిడి శ్రీనివాసులు, నాగరాజా రెడ్డి, శివశంకర్, బలరామి రెడ్డి, స్వర్ణ, రాజశేఖర్ రెడ్డి,స్పందన తదితరులు పాల్గొన్నారు.

---

## 25వ డివిజన్‌లో వెయ్యిమంది టిడిపి సభ్యత్వం



తిరుపతి(రవాణ),డిసెంబర్ 28ప్రభాతవార్త: తిరుపతి నియోజకవర్గంలోని 25వ డివిజన్‌లో రవికుమార్ పెద్ద ఎత్తున టిడిపి సభ్యత్వాలు చేర్చారు. శనివారం వెయ్యిమందికి టిడిపి సభ్యత్వం ఇప్పించి నేతలనుండి అభినందనలు అందుకున్నారు.

## తమ్మిరెడ్డి శివశంకర్‌ను కలసిన జనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ నేతలు

తిరుపతి(రవాణ),డిసెంబర్ 28ప్రభాతవార్త:

రాష్ట్ర ఎంఎస్ఎంఇ డెవపల్‌మెంట్ కార్పొరేషన్ ,రాష్ట్ర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ను శనివారం అమరావతిలో రాష్ట్రజనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ కార్యవర్గం కలిసింది. మర్యాదపూర్వక కలయికలో ఉద్యోగుల గౌరవ అధ్యక్షుడు అళహరి సుధాకర్, అధ్యక్షుడు తోకల అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు వై.చంద్రమోహన్, మల్లికార్జున, రామశంకర్, సంయుక్తకార్యదర్శి ప్రసాద్, పసుపులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని శివశంకర్‌ను సన్మానించారు.

## కేసుల పురోగతిపై దృష్టి పెట్టి పనిచేస్తేనే పురోగతి : ఎస్పి



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 28, ప్రభాతవార్త

కేసుల పురోగతిపై దృష్టి పెట్టి పని చేస్తేనే పురోగతి సాధించగలమని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు పేర్కొన్నారు. జిల్లా నెలవారి నేర సమీక్ష సమావేశం తిరుపతి శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం సావేరి సమావేశ మందిరం నందు జరిగింది. ఈ సమావేశంలో పెండింగ్లో ఉన్న వివిధ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కేసులను వాటి వివరాలను చర్చించారు. వీలైనంత త్వరగా పెండింగ్ కేసులను పరిష్కరించాలని అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు బాధ అయినా, కష్టమైన ముందుగా వచ్చేది పోలీసు వారి వద్దకేనని నిజాయితీగా అంకితభావంతో వ్యవహరించినప్పుడే ప్రజల మనసులో చిరకాలంగా గుర్తుండి పోతామన్నారు. కేసు నమోదు చేసినప్పటి నుండి కోర్టుకు పంపి ముద్దాయికి శిక్ష పడేంతవరకు పూర్తిస్థాయిలో పర్యవేక్షించినప్పుడే బాధితులకు పూర్తి న్యాయం చేసిన వారు అవుతామన్నారు. ప్రాపర్టీ కేసులకు సంబంధించి కేసులలో పురోగతి సాధించాలని కేసుల పట్ల శ్రద్ధ వహించినప్పుడే పురోగతి కనిపిస్తుందని, అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి స్టేషన్ పరిదిలోని గ్రామాలను సందర్శించడంతోపాటు క్షేత్రస్థాయిలో గ్రామ సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల యొక్క కష్టసుఖాలను సమస్యలను తెలిసికొని పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. యువతతో ముఖాముఖి మాట్లాడి సైబర్ నేరాలు, లోన్

## ప్రజలపై 1.89లక్షల కోట్ల భారం మోపిన పాపం జగన్‌దే

### - ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం,డిసెంబర్ 28 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రజలపై 1.89లక్షల కోట్ల భారం మోపిన పాపం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం కుప్పం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని వైఎస్సార్సీ నేతలు ధర్నా చేయడం ఓ వింత అన్నారు. ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో 1,89503కోట్ల భారం పడిందని వీటికి సంబంధించి వడ్డీ నే 10వేల కోట్లు చెల్లించాల్సి వస్తోందన్నారు. జెన్‌కో ప్లాంట్లు, విటిపిఎస్‌లకు వేల కోట్ల నష్టాలు తెచ్చారన్నారు. ఐదేళ్ల వైఎస్సార్సీ ప్రభుత్వం అప్పులపై ఎన్డీయే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసిందన్నారు. వైఎస్సార్సీ పాలనలో కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో)ను సుమారు 560కోట్ల నష్టాల్లోకి నెట్టేశారని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల పేర్కొన్నారు. సమావేశంలో సిఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, నేతలు బగ్గిడి వెంకటేష్, ఎవి, వల్లెప్ప, వాసు, విజయ్, భాగ్యలక్ష్మి త్రిలోక్, సుగుణమ్మ పాల్గొన్నారు.

ఫోటో రైటప్ :

## మూడు ఆలయాల్లో కియోస్క్‌ద్వారా రూ.5లక్షలు విరాళాలు



తిరుమల,డిసెంబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:

సామాన్యభక్తులు కూడా తమ విరాళాలను 1రూపాయి నుండి లక్షరూపాయల లోపు అందించేందుకు వీలుగా అన్నప్రసాదం భవనం,తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం,ఒంటిమిట్ట ఆలయంలో కియోస్క్‌యంత్రాల ద్వారా 5లక్షలు రూపాయలు విరాళం అందాయి. 15రోజుల్లో ఈ విరాళాలు భక్తుల నుండి రావడం విశేషం. సామాన్యభక్తులను దృష్టిలో ఉంచుకుని సెల్ఫ్ ఆపరేటెడ్ ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా విరాళాలు వస్తున్నాయి. శనివారం తిరుపతి పేరూరు సమీపంలోని వకుళమాత ఆలయంలోనూ కియోస్క్ ఏర్పాటుచేశారు.

## అక్రమ గ్రానైట్ క్వారీలపై మైనింగ్ అధికారుల దాడులు

### - 36 గ్రానైట్ బ్లాక్‌లు సీజ్ !!



కుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధి శీగలపల్లి, కంగుంది గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న రెండు గ్రానైట్ క్వారీలపై పలమనేరు మైనింగ్ శాఖ ఎడి బాలసుబ్రమణ్యం నేతృత్వంలో అధికారులు దాడులు చేశారు. కుప్పం మున్సిపల్ పరిధి శీగలపల్లి వద్ద సర్వే నెం 67లో అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నట్లు గుర్తించామని ఎడి తెలిపారు. ఈ అక్రమ క్వారీలో 18 గ్రానైట్ బ్లాక్‌లు సీజ్ చేశామన్నారు. అదేవిధంగా కుప్పం మండలం కంగుంది గ్రామం వద్ద సర్వే నెం 1లో నిర్వహిస్తున్న అక్రమ క్వారీలో మరో 18 అక్రమ గ్రానైట్ బ్లాక్‌లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా గ్రానైట్ క్వారీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.